ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 127, పేజీలు - 08

శనివారం, నవంబర్ 7, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

గ్రేటర్‌ను వెంటాడుతున్న జలగండం

నీటి కోసం నగరం విలవిల

- వేసవి రాకముందే నీటి కష్టాలు.. అక్టోబర్‌లోనే ట్యాంకర్లకు భారీ డిమాండ్
- జలమండలి చరిత్రలో తొలిసారి ఒకే నెలలో 2.2 లక్షల బుకింగ్స్
- గతేడాది అక్టోబర్‌లో 87 వేలే.. ఇప్పుడు మూడు రెట్లు పెరిగిన డిమాండ్
- ఎల్‌నినో ప్రభావంతో పడిపోతున్న భూగర్భజలాలు.. ఎండిపోతున్న బోర్లు
- డిసెంబర్ నుంచి మరింత గడ్డు పరిస్థితులు తప్పవంటున్న అంచనాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహానగరానికి జలగండం పొంచి ఉందా? వేసవి రాకముందే నీటి కష్టాలు నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయా? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సాధారణంగా వేసవి కాలంలో కనిపించే వాటర్ ట్యాంకర్ల రద్దీ ఈసారి అక్టోబర్ నెలలోనే మొదలైంది. జలమండలి చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక్క అక్టోబర్‌లోనే 2.2 లక్షల ట్యాంకర్ల బుకింగ్స్ నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో కేవలం 87 వేల బుకింగ్స్ మాత్రమే ఉండగా, ఈసారి ఏకంగా మూడు రెట్లకు పైగా డిమాండ్ పెరగడం నగరంలో నీటి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం రోజుకు 7 వేలకు పైగా ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. సాధారణంగా ఈ స్థాయి డిమాండ్ వేసవి సీజన్‌లో మాత్రమే కనిపిస్తుంది. కానీ ఈసారి వర్షాకాలం ముగియకముందే పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

పడిపోతున్న భూగర్భజలాలు.. ఎండుతున్న బోర్లు

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గడం నీటి కష్టాలకు ప్రధాన కారణంగా మారింది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో భూగర్భజల మట్టాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఫలితంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, టీఎన్‌జీఓఎస్ కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆయా ప్రాంతాల్లోని

2లో..

సీజేఐపై పోస్టు..

సుప్రీం గరం!

- కేరళ కాంగ్రెస్‌కు నోటీసులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను లక్ష్యంగా చేసుకుని కేరళ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియాలో పెట్టిన వివాదాస్పద పోస్ట్‌పై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. భావప్రకటనా స్వేచ్ఛను ఆయుధంగా వాడుకుని న్యాయపాలనలో జోక్యం చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. "తీర్పులను విమర్శించే హక్కు ఎప్పుడూ ఉంటుంది, కానీ న్యాయపరిపాలన ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి భావప్రకటనా స్వేచ్ఛను ఆయుధంగా వాడకూడదు" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానాల అధికారాలను దిగజార్చేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాన్నైనా ఉక్కుపాదంతో అణచివేయాల్సిన

2లో..

హైదరాబాద్‌లో

కల్తీ పాల దందా

- రంగారెడ్డి జిల్లా పోచారంలో కల్తీ పాల కేంద్రంపై దాడి
- పాల పొడి, హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో సింథటిక్ పాలు తయారీ
- ఒక నిందితుడిని అరెస్ట్ చేసి 100 లీటర్ల కల్తీ పాలు స్వాధీనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో కల్తీ పాల తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ పాలల్లో ప్రమాదకర రసాయనాలు కలిపి విక్రయిస్తున్న వ్యవహారాన్ని పోలీసులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై మహేశ్వరం జోన్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్, పాలపొడి కలిపి పాలు తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. అక్కడి నుంచి 100 లీటర్ల అనుమానిత కల్తీ పాలు, రసాయనాలు, పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోచారం గ్రామానికి చెందిన అందె శ్రీశైలం (43) పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు.

2లో..

కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

- పరిస్థితిని 'రేవంత్ వృష్టి'గా అభివర్ణన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు,

2లో..

ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలి

- అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల తీవ్ర నష్టం

- నష్టాన్ని అంచనా వేస్తున్నాం, ప్రతి రైతునూ ఆదుకుంటామమని భరోసా - పంటల బీమా, సబ్సిడీతో నష్టపోయిన పెట్టుబడి అందిస్తామని వెల్లడి
- తుపానుల వేళ గత ప్రభుత్వం రెడ్ కార్పెట్ పర్యటనలు చేసిందని విమర్శలు - నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్ఘాటన



అమరావతి (ప్రశ్న న్యూస్) 'అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వచ్చింది. తుఫాన్ల వల్ల పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ల వల్ల రైతులు నష్టపోయారు'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఎల్ నినో వల్ల రైతులు గడ్డు పరిస్థితుల్లో ఉంటే పట్టిసీమ ద్వారా నీళ్లందిస్తే రైతులు పంట వేసుకున్నారు. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుఫాన్ రైతులను దెబ్బతీసింది. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలా వరకు నష్టాన్ని నివారించగలిగాం.గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలను మురసు తుఫాన్ బాగా ఇబ్బంది పెట్టింది'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.'ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీతో నష్ట పోయిన పెట్టుబడిని రైతులు దక్కించుకోవచ్చు'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

2లో..

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- 40 వేల మంది సిబ్బంది, డ్రోన్ల నిఘా - కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత, 144 సెక్షన్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పరిషత్ ఎన్నికలు ఇటీవలే ముగిసిన సంగతి తెలిసిందే. ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం భారీ ఏర్పాట్లు పూర్తి చేసింది. నేడు ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం 9,062 లెక్కింపు బల్లలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో 77 జెడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 577 జెడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

2లో..

కొడంగల్ అభివృద్ధికి

సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్



- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నేటి నుండి మూడు రోజులు ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

2లో..

పోలీసుల ఆరోగ్యానికి 'ఫిట్‌కాప్'

- 90 వేల మంది సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక నిఘా
- త్వరలో అందుబాటులోకి సమగ్ర హెల్త్ మేనేజ్‌మెంట్ యాప్
- ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా వైద్య సాయం, కౌన్సెలింగ్ ఏర్పాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడి, సమయపాలనలో ఇబ్బందులు, విధి బాధ్యతల మధ్య వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేని పరిస్థితి వెరసి అనేకమంది పోలీసు సిబ్బంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో సమగ్ర హెల్త్ మేనేజ్‌మెంట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

2లో..

హైదరాబాద్ హైటెక్స్‌లో

'భారత్ సమ్మిట్'

- 100 దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ స్థాయిలో మరో భారీ సదస్సుకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, వివిధ రంగాల్లో అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ' భారత్ సమ్మిట్ ' నిర్వహించనున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో 3 రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు

2లో..

లక్డీకాపూల్‌లోనూ వన్‌వే

- ట్రాఫిక్ పోలీసుల కసరత్తులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు పోలీసులు మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్‌వే విధానం మంచి ఫలితాలు ఇస్తుండటంతో ఇప్పుడు లక్డీకాపూల్ ప్రాంతంలోనూ ఇదే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. నిత్యం వాహనాల రద్దీతో ఇబ్బందులు ఎదురయ్యే ఈ ప్రాంతంలో రాకపోకలను క్రమబద్ధీకరించి ప్రయాణ సమయాన్ని తగ్గించడమే లక్ష్యంగా కొత్త ట్రాఫిక్ ప్రణాళిక రూపొందిస్తున్నారు. లక్డీకాపూల్ పరిసరాల్లో వన్‌వే విధానం అమలుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్వయంగా రంగంలోకి దిగారు. ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్,

2లో..

గ్రేటర్‌ను వెంటాడుతున్న జలగండం

ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ప్రతిరోజూ 250 నుంచి 300 ట్యాంకర్లు నీటి కోసం బారులు తీరుతున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో రోజుకు 1,500 నుంచి 2,000 ట్యాంకర్లు మాత్రమే బుక్ అయ్యేవి. ప్రస్తుతం ఆ సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగింది.

ట్యాంకర్లపైనే అపార్ట్‌మెంట్ల ఆధారం

నగరంలోని అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలకు నీటి అవసరాలు తీర్చుకోవడం సవాల్‌గా మారింది. నల్లాల ద్వారా సరిపడా నీరు అందకపోవడం, బోర్లు పనిచేయకపోవడంతో ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ ట్యాంకర్ బుక్ చేసుకుంటేనే అవసరాలు తీరుతున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని జలమండలి అధికారులు అదనపు ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నా, కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు రెండు మూడు రోజుల సమయం పడుతోంది. మరోవైపు ప్రైవేట్ ట్యాంకర్ల ధరలు సైతం పెరిగిపోయాయి. ఒక్కో ట్యాంకర్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

డిసెంబర్ నుంచి మరింత గడ్డు పరిస్థితి?

ప్రస్తుత నీటి కష్టాలు రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు, అధికారులు హెచ్చరిస్తున్నారు. సింగూరు, మంజీరా వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వర్షపాతం లోటు ఇలాగే కొనసాగితే డిసెంబర్ నుంచి నగరంలో నీటి సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీటి సరఫరా జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ నగరానికి రోజుకు సుమారు 735 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం కాగా, ప్రస్తుతం ఆ అవసరానికి తగ్గట్టుగా సరఫరా జరగడం లేదని అంచనాలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పుడే మేల్కొనకపోతే ముప్పే!

వేసవి కాలం ప్రారంభం కాకముందే నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి పొదుపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన మురుగునీటిని (ట్రీటెడ్ వాటర్) వినియోగించడం, భూగర్భజలాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్)ను ప్రోత్సహించడం వంటి చర్యలు అత్యవసరంగా మారాయి. జలమండలి సైతం అదనపు ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటు, ట్యాంకర్ల సంఖ్య పెంపు దిశగా చర్యలు చేపడుతోంది. అయినప్పటికీ అక్టోబర్ నెలలోనే ఈ స్థాయిలో ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడటం నగర భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. వేసవి రాకముందే మొదలైన ఈ జలగండం రానున్న నెలల్లో ఇంకెంత తీవ్రరూపం దాల్చుతుందోనన్న భయం నగరవాసులను వెంటాడుతోంది.

సీజేఐపై పోస్టు.. సుప్రీం గరం!

అవసరం ఉందని కోర్టు పేర్కొంది. ఈ మేరకు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కోర్టుధిక్కార నోటీసులు జారీ చేసింది.

రాజ్యాంగమే గొప్పది

రాజ్యాంగ ఔన్నత్యాన్ని పునరుద్ఘాటిస్తూ “రాజ్యాంగమే అత్యున్నతమైనది. ఏ వ్యక్తి గానీ, రాజకీయ సంస్థ గానీ దానికంటే ఉన్నతస్థానంలో లేరు” అని కోర్టు స్పష్టం చేసింది. సోషల్ మీడియా పోస్ట్‌పై వచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని సుప్రీంకోర్టు సుమోటాగా పిటిషన్ నమోదు చేసింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రకారం అక్టోబర్ 13న ప్రధాన న్యాయమూర్తికి సీనియర్ లాయర్ వినీత్ జిందాల్ అందించిన ఫిర్యాదును అక్టోబర్ 30న రిట్ పిటిషన్‌గా నమోదు చేసింది. అలాగే, అక్టోబర్ 12న సాయంత్రం రాహుల్ గాంధీ, ఇతర నాయకులు సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన నిరసన ఎలాంటి అనుమతి లేకుండా జరిగిందా? దానివల్ల లాయర్లు, కక్షిదార్లు, లేదా కోర్టు సిబ్బంది రాకపోకలకు ఏదైనా ఆటంకం కలిగిందా? అనే అంశంపై కూడా అధికారులతో దర్యాప్తు చేయించాలని కూడా ఆ ఫిర్యాదులో కోరారు.

కాంగ్రెస్ వివరణ

అక్టోబర్ 12న కేరళ కాంగ్రెస్ అధికారిక ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో సీజేఐని ఉద్దేశించి పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయి తీవ్ర విమర్శలకు దారితీసింది. దాంతో ఆ పోస్ట్‌ను డిలీట్ చేసిన పార్టీ, దాన్ని ప్రచురించిన బాధ్యున్ని పదవి నుంచి తొలగించింది. ఈ వివాదంపై కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ మాట్లాడుతూ పార్టీ హైకమాండ్‌తో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఆ వివాదాస్పద పోస్ట్ పెట్టారని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి న్యాయవ్యవస్థ నిష్పాక్షికతపై ఎలాంటి విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలి

తుఫాన్లపై హెచ్చరికలను తేలిగ్గా తీసుకోవద్దు

‘తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు చేస్తే ఎవ్వరూ తేలిగ్గా తీసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ముందస్తు చర్యలతోనే చాలా వరకు ఆస్తి నష్టాన్ని తగ్గించి, సహాయక చర్యలు వేగంగా చేపట్టగలిగాం. తుఫాన్ సహాయ చర్యల కోసం తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు నుంచి సాయం తీసుకుంటున్నాం’అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ‘అర్నబ్ తుఫాన్ వల్ల నేల కొరిగిన 30 వేల విద్యుత్ స్థంభాలను పునరుద్దరించగలిగాం. మురసు తుఫాన్ వల్ల కూడా మరో 10 వేల విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయి. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్దరిస్తున్నాం. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం’అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

నల్లమడ డ్రైన్‌కు శాశ్వత పరిష్కారానికి కృషి

‘తుఫాన్ల ప్రభావితంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాం. తుఫాన్ల ప్రభావంపై ప్రధాని నరేంద్ర మోడీ అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందేంత వరకు పని చేస్తాం. నల్లమడ డ్రైన్ కు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం’అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.‘గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. గత పాలనలో తుఫాన్లు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి, పరామర్శించారు. ఎన్నికల కంటే, ప్రజా సమస్యలే ముఖ్యంగా భావించి తుఫాన్ల సమయంలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందిగా పెట్టడమే పనిగా పెట్టుకున్నారు’అని సీఎం చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు.

రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది

‘పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్ని విషయాలు మాట్లాడతాం. తీర ప్రాంతాలను తుఫాన్లు దెబ్బతీస్తే రాయలసీమ ప్రాంతాన్ని ఎల్ నినో ఇబ్బంది పెట్టింది. రాయలసీమలో కూడా కరువును అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించాయి’అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ‘తీర ప్రాంతంలో నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతుంటే రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది.అందుకే నీటి భద్రతకు సమర్ధ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం’అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

పంటపొలాల్లో నడుచుకుంటూ వెళ్లిన సీఎం చంద్రబాబు

మరోవైపు జిల్లెళమూడి వంతెన నుంచి రేటూరు గ్రామం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడుచుకుంటూ వెళ్లారు. దారి పొడవునా రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతూ తుఫాన్ నష్టం వివరాలను సీఎం చంద్రబాబు నాయుడు అడిగితెలుసుకున్నారు. నల్లమడ వాగు గేట్లు పాడైపోయాయని వాటిని సరి చేయించాలని ముఖ్యమంత్రికి రైతుల విజ్ఞప్తి చేశారు.‘నల్లమడ వాగు పరిస్థితిపై సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు.‘పాడైపోయిన గేట్లను మరమ్మత్తులు చేయించాలని, లేదా కొత్త గేట్లను బిగించేందుకు ప్రతిపాదనలు పంపాలి. పంట చేలకు వరద రాకుండా నియంత్రించటంతో పాటు వరద నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ఆలోచించాలి. జిల్లెళమూడి-రేటూరు గ్రామాల మధ్య కొన్ని ప్రాంతాల్లో కోతకు గురైన రోడ్డును సీఎం పరిశీలించారు. సీఎంను కలిసిన రేటూరు గ్రామ రైతులు పట్టిసీమ ద్వారా వచ్చే నీటితో పంటలు వేసుకున్నామని, కానీ ప్రకృతి విపత్తుతో నష్టపోయాం’అని రైతులు సీఎం చంద్రబాబు నాయుడు వద్ద వాపోయారు.

సాగునీటి సంఘం ప్రతినిధులతో ముఖాముఖి

‘తుఫాన్లు తాకిడి లేకుండా సీజన్ కంటే ముందు నీళ్లు ఇచ్చేలా ప్రణాళిక చేసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ‘పోలవరం పూర్తి అయితే ముందుగానే పంటలు వేసుకునేలా చూడవచ్చు. పంటల బీమా చేయించుకున్నారా.? అని ప్రతి రైతును అడిగి తెలుసుకున్నారు. రేటూరులో పంట కాలువ గట్టుపై నడుచుకుంటూ వెళ్లి మునిగిపోయిన వరిచేలను సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. రైతులకు మేలు జరిగేలా ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతుల ఫోన్ల ద్వారా సమాచారం వస్తుందా.? రావడం లేదా.? అని అడిగారు. సాగునీటి సంఘం ప్రతినిధులతో ముఖ్యమంత్రితో మాట్లాడారు.కాల్వలు తూముల్లో ఉన్న కంపను ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగిస్తున్నారా.? లేదా.? అని సీఎం చంద్రబాబు నాయుడు అడిగితెలుసుకున్నారు.

కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

అనావృష్టి కాదు, రేవంత్ వృష్టి” అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహ ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

హైదరాబాద్‌లో కల్తీ పాల దందా

అయితే అతడు పాలల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో పాటు ధోల్‌పూర్ బ్రాండ్ పాలపొడిని కలిపి కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇలా తయారుచేసిన పాలను హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. శుక్రవారం ఈ కల్తీ పాల తయారీ కేంద్రంపై మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. పాల తయారీలో ఉపయోగిస్తున్న పదార్థాలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 100 లీటర్ల అనుమానిత కల్తీ పాలను సీజ్ చేశారు. వీటితో పాటు ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్, ఒక్కోటి కిలో బరువు ఉన్న 35 ధోల్‌పూర్ పాలపొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు శ్రీశైలంతో పాటు స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ పాలు ఎంతకాలంగా తయారు చేస్తున్నారు హైదరాబాద్‌లో ఏయే ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు ఇంకా ఎవరైనా ఈ దందాలో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ అనేది క్రిమిసంహారక, శుభ్రపరిచే అవసరాలకు ఉపయోగించే రసాయనం. ఈ కెమికల్‌ను ఆహార పదార్థాల్లో అనుమతి లేని విధంగా కలపడం ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి కల్తీ పాలను తీసుకుంటే కడుపులో మంట, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. రసాయనం గాఢత, తీసుకున్న పరిమాణాన్ని బట్టి జీర్ణవ్యవస్థకు మరింత తీవ్రమైన నష్టం కలిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీసుకునే పాల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అనుమానాస్పద పాలను వినియోగించకూడదని కల్తీపై అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు తెలిపారు. రోజువారీ అవసరమైన పాలలోనే రసాయనాలు కలుపుతున్న ఘటన వెలుగులోకి రావడంతో హైదరాబాద్ వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

70శాతం నమోదైన పోలింగ్

రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. 2021 ఎన్నికల్లో నమోదైన 60.91 శాతంతో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ బాక్సుల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారు. మొత్తం కౌంటింగ్ బల్లల్లో 50 శాతం జెడ్పీటీసీ, మిగిలిన 50 శాతం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అందజేస్తారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు. భద్రతా విధుల్లో 135 మంది డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, 572 మంది ఇన్‌స్పెక్టర్లు, 1,412 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 14,877 మంది ఏఎస్‌ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు, 2,889 మంది హోంగార్డులు పాల్గొంటున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందికి బాడీ వోర్న్ కెమెరాలను అందుబాటులో ఉంచారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఐజీ బి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

కొడంగల్ అభివృద్ధికి

సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు.రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు. నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు.కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు.రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

పోలీసుల ఆరోగ్యానికి ‘ఫిట్‌కాప్’

ఈ విషయాన్ని డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఒత్తిడి కారణంగా ఆరోగ్యంపై దృష్టి సారించలేకపోతున్న సిబ్బందికి ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

30-45 రోజుల్లో అందుబాటులోకి

హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌తో పాటు ఇతర సంస్థల సహకారంతో ఈ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ వ్యవస్థను రూపొందిస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీనిని అమల్లోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ యాప్‌లో ప్రతి పోలీసు ఉద్యోగి తన వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం తదితర వివరాలను సేకరించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తారు. మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా సిబ్బంది ఈ వ్యవస్థలోకి లాగిన్ కావచ్చు.

మూడు రకాలుగా రిస్క్ వర్గీకరణ

సిబ్బంది నమోదు చేసిన ఆరోగ్య వివరాల ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా విభజిస్తారు. తద్వారా ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి? ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరం? అనే అంశాలను గుర్తించే వీలుంటుంది. రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల్లో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందించనున్నట్లు వివరించారు.

వ్యాధులు ముదరకముందే గుర్తింపు

ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. వ్యాధులు ముదిరి తీవ్ర ఆరోగ్య సమస్యలుగా మారకముందే అవసరమైన వైద్య సహాయం అందించనున్నారు. సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

అన్ని విభాగాలకూ విస్తరణ

తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాల సిబ్బందికి ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. పోలీసుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, అవసరమైన సమయంలో వైద్య సహాయం అందించే వ్యవస్థగా ‘ఫిట్‌కాప్’ నిలుస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని పోలీస్ శాఖ భావిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమావేశంలో పలువురు సీనియర్ పోలీసు అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ హైటెక్స్‌లో

‘భారత్ సమ్మిట్’

సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించారు. మొత్తం 450 మంది ప్రముఖ అతిథులు ఈ సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.భారత్ సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దాదాపు 100 దేశాల నుంచి దౌత్యవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఇందుకోసం సుమారు 450 మంది విశిష్ట అతిథులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపించారు. తెలంగాణ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వివిధ దేశాల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సదస్సును విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.ఈ అంతర్జాతీయ సదస్సుకు పలువురు కేంద్రమంత్రులు, ఎంపీలు, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ జాతీయ నాయకుడు, ఎంపీ శశిథరూర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. దౌత్య, రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖులు ఒకే వేదికపైకి రావడం ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వివిధ దేశాల ప్రతినిధులతో భారత నాయకులు నేరుగా చర్చలు జరిపేందుకు ఈ సమావేశం అవకాశం కల్పించనుంది. మూడు రోజుల పాటు జరిగే భారత్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలు, ఆర్థిక అభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, వివిధ రంగాల్లో పరస్పర సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. భారత్‌తో ఇతర దేశాలకు ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు కొత్త భాగస్వామ్యాలకు అవకాశాలు అన్వేషించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ అంతర్జాతీయ సదస్సులు, పెట్టుబడుల సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. తాజాగా 100 దేశాల ప్రతినిధులు పాల్గొనే భారత్ సమ్మిట్ నిర్వహణతో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరగనుంది. ప్రపంచ దేశాల ప్రముఖులకు ఆతిథ్యం ఇవ్వడానికి హైటెక్స్ వేదికగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త అవకాశాలు, సంబంధాలు ఏర్పడతాయని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

లక్డీకాపూల్‌లోనూ వన్‌వే

ఇతర అధికారులతో కలిసి బైక్‌పై ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ద్వారకా హోటల్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, ఓల్డ్ కంట్రోల్ రూమ్ వంటి జంక్షన్లలో వాహనాల రద్దీ, రోడ్ల పరిస్థితులను పరిశీలించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సమయాల్లో వాహనాలు నిలిచిపోకుండా ఎలాంటి మార్పులు చేయాలనే అంశంపై అధికారులతో చర్చించారు. ఆయా కూడళ్లలో వన్‌వే విధానం అమలు చేస్తే రాకపోకలు ఎంతవరకు సులభతరం అవుతాయో సమీక్షించారు. లక్డీకాపూల్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 3 కీలక మార్గాల్లో మార్పులు చేయాలని పోలీసులు ప్రాథమికంగా ప్రతిపాదనలు తెరపైకి తీసుకువస్తున్నారు. రవీంద్రభారతి, ఇక్బాల్ మినార్, సచివాలయం, ఓల్డ్ కంట్రోల్ రూమ్ జంక్షన్ల మధ్య వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. రవీంద్రభారతి నుంచి ఇక్బాల్ మినార్ వైపు వెళ్లే వాహనాలను హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ మీదుగా మళ్లించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి ఈ మార్పులు చేర్పులు అన్నీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. వీటిపై త్వరలోనే జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు.

ఆయా శాఖల నుంచి అవసరమైన అనుమతులు, సహకారం తీసుకున్న తర్వాత తొలుత ప్రయోగాత్మకంగా వన్‌వే విధానాన్ని అమలు చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ప్రయోగం ద్వారా వచ్చే ఫలితాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.మరోవైపు కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఇప్పటికే అమల్లో ఉన్న వన్‌వే విధానాన్ని కూడా సీపీ సజ్జనర్ మరోసారి పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ నిర్వహణలో మెరుగైన ఫలితాలు వస్తుండటంతో వాహనాల రద్దీని మరింత తగ్గించేందుకు అదనంగా మరో ట్రాఫిక్ లేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే దీనికి భూగర్భ పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా ఉన్నట్లు గుర్తించారు. వాటిని సంబంధిత శాఖల సమన్వయంతో తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిత్యం రద్దీగా ఉండే మరిన్ని ప్రాంతాల్లోనూ వన్‌వే విధానం అమలు చేసే అవకాశాలను ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు. ట్రాఫిక్ నిపుణులతో చర్చిస్తూ రహదారుల పరిస్థితులు, వాహనాల రాకపోకలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయాలని భావిస్తున్నారు. లక్డీకాపూల్‌లో ప్రతిపాదిత వన్‌వే విధానం అమల్లోకి వస్తే ఆ పరిసరాల్లో ట్రాఫిక్ కష్టాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే తుది మార్గాలు, అమలు తేదీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

టీపీసీసీ కంట్రోల్ చేయలేకపోతున్నారే

హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పిసిసి పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.

కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్స్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు. సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.

బాబా దీవెనలు.. కూటమి నేతల మొక్కులు

షాబుఖారి దర్గాలో విజేతల సందడి

గెలుపు అనంతరం చాదర్ సమర్పణ

అల్తాఫ్ బాబాకు ఘన సత్కారం

లంగర్ ఖానా అన్నదానం ప్రారంభం



కొండపల్లి(ప్రశ్న న్యూస్) ఎన్నికల్లో విజయం.. దర్గాలో మొక్కుల చెల్లింపు.. బాబా ఆశీస్సులకు కృతజ్ఞతలు.. ఇదీ కొండపల్లిలో కూటమి కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సందడి, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం హజ్రత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గాను సందర్శించిన కూటమి ప్రజాప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బాబా వారి ఆశీస్సులతోనే ఎన్నికల్లో విజయం సాధించామని పేర్కొంటూ అల్తాఫ్ బాబాకు కృతజ్ఞతలు తెలిపారు.శుక్రవారం కొండపల్లిలోని సుప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గాకు కూటమి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మేళతాళాలతో చేరుకున్నారు. చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా తమ మొక్కులను చెల్లించుకున్నారు. దర్గాకు చేరుకున్న ప్రజాప్రతినిధులకు అల్తాఫ్ బాబా శాలువాలు కప్పి సత్కరించారు.

నామినేషన్ ముందే మొక్కు.. గెలుపుతో చెల్లింపు..

ఈ సందర్భంగా కూటమి ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు దర్గాలో ప్రార్థనలు నిర్వహించి ఎన్నికల్లో విజయం సాధించాలని మొక్కుకున్నామని తెలిపారు. బాబా వారి ఆశీస్సులతో విజయం సాధించామని, తమకు ఎప్పటి నుంచో దర్గాతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. దర్గాను సందర్శిస్తే శుభం జరుగుతుందన్న నమ్మకం తమకు ఉందన్నారు.ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచి ఆశీర్వచనాలు అందించిన అల్తాఫ్ బాబాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రభుత్వ అండదండలతో ప్రజలకు మంచి చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

ప్రజాసేవే లక్ష్యం..

ఎన్నికల్లో గెలుపొందడం బాధ్యతను మరింత పెంచిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కూటమి ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మత సామరస్యం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే దర్గాను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు.అనంతరం హజ్రత్ సయ్యద్ షాబుఖారి లంగర్ ఖానా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక సేవకు శ్రీకారం చుట్టారు.

పాల్గొన్న ప్రజాప్రతినిధులు..

ఈ కార్యక్రమంలో విజయవాడ 43వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం కనకదుర్గ, 33వ డివిజన్ కార్పొరేటర్ స్నేహ సంతోష్, నందిగామ 22వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇమామ్ జానీ, కొండపల్లి 4వ వార్డు కౌన్సిలర్ భయ్యా సామ్రాజ్యం, 5వ వార్డు కౌన్సిలర్ అందె చిట్టిబాబు, 7వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ నేహా, 15వ వార్డు కౌన్సిలర్ చెరుకు మహేష్, మహ్మద్ అఫ్సర్, తులసి, భయ్యా రామ, స్థానిక టీడీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై దీపావళి వెలుగులు

రాత్రి 7 గంటలకు ఆలయ కవాట బంధనం

ధనత్రయోదశి మహాలక్ష్మి యాగం,

దీపావళి రోజు ప్రత్యేక పూజలు

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి దంపతులు



విజయవాడ (ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై దీపావళి పర్వదిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శనివారం ధనత్రయోదశి సందర్భంగా మహాలక్ష్మి యాగం.. ఆదివారం దీపావళి రోజున ధనలక్ష్మీ పూజ, దీపాలంకరణతో అమ్మవారి సన్నిధి ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. అయితే దీపావళి పూజలు ముగిసిన అనంతరం ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రధాన ఆలయంతో పాటు అన్ని ఉపాలయాల కవాట బంధనం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.కె. శీనానాయక్ వెల్లడించారు.

ధనత్రయోదశి.. మహాలక్ష్మి యాగం..

ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 7వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు పాత యాగశాలలో దేవస్థానం తరఫున శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహించనున్నారు. వైదిక కమిటీ సూచనల మేరకు భక్తులకు పరోక్షంగా ఈ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ధనత్రయోదశి సందర్భంగా అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పర్వదిన వేళ అమ్మవారిని స్మరించుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని దేవస్థానం కోరుతోంది.

దీపావళి.. ధనలక్ష్మీ పూజతో ప్రత్యేక శోభ..

నవంబర్ 8 ఆదివారం దీపావళి పర్వదినం సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ అమ్మవారి ప్రధానాలయంలో ప్రత్యేకంగా ధనలక్ష్మీ పూజ నిర్వహించనున్నారు. ఆలయాన్ని దీపాలతో అలంకరించి, బాణాసంచా వెలిగించే కార్యక్రమాలు వైభవంగా చేపట్టనున్నారు.దీపాల వెలుగుల్లో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారి కృపాకటాక్షాలను పొందాలని దేవస్థానం అధికారులు ఆకాంక్షించారు.

అమ్మవారి దర్శనానికి హైకోర్టు న్యాయమూర్తి..

ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి దంపతులు ఇంద్రకీలాద్రిపై శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి సన్నిధిలో న్యాయమూర్తి దంపతులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ధనత్రయోదశి, దీపావళి పర్వదినాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు, దీపాలంకరణలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి. ఆలయ కవాట బంధన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు దర్శనానికి రావాలని దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు.

ఎన్టీఆర్ జడ్పీ పీఠం.. మాలలకు ఇవ్వాల్సిందే

రాజకీయ ప్రాతినిధ్యంలో మాలలకు అన్యాయం

ఎన్టీఆర్ జిల్లా (ప్రశ్న న్యూస్) ఓట్లు ఉన్నాయి.. జనాభా ఉంది.. రాజకీయంగా బలమైన ఉనికీ ఉంది.. అయినా పదవుల్లో మాత్రం తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి మాల సామాజిక వర్గంలో వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని మాల సామాజిక వర్గానికి చెందిన జడ్పీటీసీకి కేటాయించాలని మాల ఐక్యవేదిక జిల్లా నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1.75 లక్షల వరకు మాల సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ, రాజకీయ ప్రాతినిధ్యంలో తమకు న్యాయం జరగాలని కోరుతున్నారు.

పదవుల పంపకంలో మాలలకు చోటేదీ..

ఎన్టీఆర్ జిల్లాలో రాజకీయంగా కీలకమైన పదవులు మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు దక్కుతున్నాయని మాల నాయకులు ప్రస్తావిస్తున్నారు. తిరువూరు, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తంగిరాల సౌమ్య, కొటికలపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వర్ల రామయ్యకు ఎమ్మెల్సీ పదవి దక్కగా, ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని మాజీ మంత్రి జవహర్‌కు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో మాల సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కీలక పదవుల్లో ఒక సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభిస్తున్నప్పుడు, మరో వర్గానికి కూడా అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యత పాటించాలని కోరుతున్నారు.

జడ్పీ పీఠంపై కూటమి నిర్ణయం ఏంటి..

ఎన్టీఆర్ జిల్లా జడ్పీ చైర్మన్ పదవి కేటాయింపు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతోంది. మాల సామాజిక వర్గానికి చెందిన జడ్పీటీసీకి ఈ పదవి కేటాయిస్తే తమకు రాజకీయంగా న్యాయం జరిగినట్లవుతుందని మాల ఐక్యవేదిక నాయకులు భావిస్తున్నారు.కూటమి నాయకత్వం జిల్లాలోని సామాజిక సమీకరణాలను, వివిధ వర్గాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. పదవుల పంపకంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించడం ద్వారా పార్టీపై విశ్వాసం మరింత



పెరుగుతుందని పేర్కొంటున్నారు.

ఎర్రకాలువ ఉగ్రరూపం..

కోటసత్తెమ్మ ఆలయం జలదిగ్బంధం

అమ్మవారి ఆలయంలోకి వరద నీరు,

దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేత



నిడదవోలు(ప్రశ్న న్యూస్) ఎర్రకాలువ ఉగ్రరూపం దాల్చింది.. భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తింది.. ప్రసిద్ధ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయాన్ని ముంపులోకి నెట్టింది. భక్తుల కొంగుబంగారంగా, ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరొందిన తిమ్మరాజుపాలెంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలోకి వర్షపు నీరు చేరడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆలయ పరిసరాలతో పాటు గర్భాలయ ప్రాంగణంలోకి నీరు ప్రవేశించడంతో భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు.

వర్షం దెబ్బకు దర్శనాలకు బ్రేక్..

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం ఎర్రకాలువ వరద ముంపునకు గురైంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఆలయ పరిసరాల్లోకి నీరు చేరింది. క్రమంగా నీటి మట్టం పెరగడంతో ఆలయ ప్రాంగణం కూడా ముంపు బారిన పడింది. గర్భాలయ ప్రాంగణంలోకి వర్షపు నీరు చేరడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆలయంలోకి వరద నీరు చేరిన నేపథ్యంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆలయ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు భక్తులు దర్శనాలకు రావద్దని సూచించారు.

భక్తుల భద్రతే ముఖ్యం..

అమ్మవారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయ పరిస్థితిని తెలుసుకుని రావాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో నీరు నిల్వ ఉండటం, వరద ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలను నిలిపివేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గి, ఆలయ ప్రాంగణం పూర్తిస్థాయిలో సురక్షితంగా మారిన తర్వాతే దర్శనాలను పునఃప్రారంభించే విషయంపై నిర్ణయం తీసుకోనున్నారు. దర్శనాల పునఃప్రారంభానికి సంబంధించిన వివరాలను భక్తులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

మురసు తుపాను మృత్యుపాశం,

ఏడుగురు తమిళ జాలర్లు బలి

సముద్రంలో బోటు మునక.. ఇద్దరి ఆచూకీ గల్లంతు

గాలింపు ముమ్మరం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశం



ప్రకాశం(ప్రశ్న న్యూస్) మురసు తుపాను సముద్రంలో మృత్యుపాశం విసిరింది. అలల ఉద్ధృతికి తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు సముద్రంలో మునిగిపోయి ఏడుగురు జాలర్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి ఆచూకీ తెలియకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. తుపాను అలజడిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తుపాను అలజడి.. బోటు మునక..

మురసు తుపాను ప్రభావంతో సముద్రంలో అలజడి నెలకొన్న సమయంలో తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు ప్రమాదానికి గురైంది. బోటులో మొత్తం తొమ్మిది మంది మత్స్యకారులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, మరో ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉంది. సముద్రంలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకాశం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో బోటులో ఉన్న మత్స్యకారుల పరిస్థితి, ఇప్పటివరకు లభించిన మృతదేహాలు, గల్లంతైన వారి వివరాలపై ఆరా తీశారు.

గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు ముమ్మరం..

సముద్రంలో గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకార బృందాలు సమన్వయంతో పనిచేస్తూ గాలింపు కొనసాగించాలని సూచించారు.తుపాను ప్రభావిత సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టడం సవాలుతో కూడుకున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించాలని పేర్కొన్నారు.

మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు..

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల మృతదేహాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. పోస్టుమార్టం ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.మత్స్యకార కుటుంబాలకు ఈ ఘటన తీరని విషాదాన్ని మిగిల్చిందని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించే విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుపాను హెచ్చరికలను పట్టించుకోకుంటే ప్రమాదమే..

తుపాను హెచ్చరికలు జారీ చేసిన సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సముద్రంలో అలల ఉద్ధృతి, వాతావరణ పరిస్థితులపై మత్స్యకారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. మత్స్యకారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, తుపాను సమయంలో అప్రమత్తతతో వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. గల్లంతైన ఇద్దరి ఆచూకీ లభించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

భక్తుల సేవే లక్ష్యం.. విద్య, వైద్యానికి పెద్దపీట

టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్‌గా ముద్దాడ రవిచంద్ర ప్రమాణం

64 ఆలయాల్లో సేవల మెరుగుదలకు సంకల్పం



తిరుమల(ప్రశ్న న్యూస్) భక్తులకు మెరుగైన దర్శనం.. విద్యార్థులకు నాణ్యమైన విద్య.. రోగులకు ఆధునిక వైద్యం! తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) సాధికారిక మండలి ఛైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి సేవలో మరింత సమర్థవంతమైన విధానాలు అమలు చేయడంతో పాటు, టీటీడీ పరిధిలోని ఆలయాలు, విద్యాసంస్థలు, వైద్యశాలల్లో సేవల నాణ్యతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలు సమర్పించారు.

భక్తులకు సేవల్లో మరింత మెరుగుదల..

ప్రమాణస్వీకారం అనంతరం శ్రీవారి ఆలయం ముందు మీడియాతో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, దేవుని సేవ చేసే గొప్ప అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.ప్రస్తుతం టీటీడీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా, మెరుగైన రీతిలో కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తమ మనసును పూర్తిగా స్వామివారిపై లగ్నం చేసేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత టీటీడీపై ఉందని పేర్కొన్నారు.భక్తులకు అన్ని విధాలా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని, దర్శనానికి వచ్చే భక్తుల అవసరాలు, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ఇతర 64 ఆలయాల్లోనూ భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వెల్లడించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు..

టీటీడీ నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారిస్తామని ఛైర్మన్ తెలిపారు.విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా, సేవాభావం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైద్య సేవల్లో ఆధునికత..

టీటీడీ ఆధ్వర్యంలోని వైద్యశాలలకు వచ్చే రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని ముద్దాడ రవిచంద్ర తెలిపారు.భక్తులకు సౌకర్యాలు, ఆధ్యాత్మిక సేవలతో పాటు విద్య, వైద్య రంగాల్లోనూ మరింత విస్తృతంగా సేవలందించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. టీటీడీ నిర్వహించే అన్ని సేవా విభాగాల్లో నాణ్యత, సమర్థత పెంపునకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవో (ఆరోగ్యం, విద్య) ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి కానుక:నర్మదా



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) దీపావళి పండుగ వేళ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఆనందకరమైన వాతావరణం నెలకొంది. పండుగ సంబరాలను ప్రజలతో పాటు సమాజం కోసం నిరంతరం శ్రమించే నిజమైన వారితో పంచుకోవాలనే ఉద్దేశంతో చక్కటి కార్యక్రమం నిర్వహించిన భాజపా నాయకులు.మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని స్థానిక బిజెపి నేతలు తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని: 1 నుంచి 8వ వార్డు వరకు వివిధ ప్రాంతాలలో ఈ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ మొత్తం పరిధిలో నిరంతరం శ్రమిస్తున్న సుమారు వెయ్యి మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి దీపాళీ కానుకలను అందజేశారు.పండగ రోజున కూడా తమ ఇళ్లకు దూరంగా ఉంటూ,ప్రజల ఆరోగ్యం పారిశుద్ధ్య పరిరక్షణ కోసం వీరు పడుతున్న శ్రమ అసాధారణమైనదని, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా,ఎండనక, వాననక తమ సేవలను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తున్న కార్మికుల కష్టాన్ని మరువలేమని ఈ సందర్భంగా నేతలు అభివర్ణించారు.కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ స్వయంగా ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉందంటే దానికి ప్రధాన కారణం తెల్లవారుజాము నుంచే వీధులను శుభ్రపరిచే పారిశుద్ధ్య కార్మికులేనని కొనియాడారు.ప్రజలందరూ దీపావళి దీపాలతో ఇళ్లలో వెలుగులు నింపుకుంటున్న సమయంలో,పరిశుద్ధతను నిలిపే కార్మికుల జీవితాల్లో ఆనందం నింపాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.కంటోన్మెంట్ లోని ప్రతీ ఒక్క కార్మికుడి కుటుంబం కూడా దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేకంగా స్వీట్ బాక్సులు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్మికుల సంక్షేమం కోసం,వారి కుటుంబాల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడు ముందుంటానని,తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ అందిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో కంటోన్మెంట్ పరిధిలోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రజా ప్రతినిధులు తమను గుర్తించి స్వీట్లు పంపిణీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ పండుగ పూట తమను కుటుంబ సభ్యుడిగా భావించి ఈ కానుక అందజేయడం తమకు ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని కార్మికులు పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు కార్మికుల్లో నైతిక స్థైర్యాన్ని నింపుతాయని అన్నారు. ఈ వేడుకల ద్వారా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతమంతా ఒక పండుగ వాతావరణం సంతరించుకుందని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు బానాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మచ్చ బొల్లారంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ
సభ్యురాలు విజయ భారతి

సయాని క్షేత్రస్థాయి పరిశీలన

పాల్గొన్న జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్(ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా మచ్చ బొల్లారంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి సయాని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపునకు జిల్లా కలెక్టర్ గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాల ను సందర్శించారు.మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశానవాటిక ప్రాంతం డంపింగ్ యార్డుగా వినియోగించబడుతోందన్న ఆందోళనల నేపథ్యంలో, అక్కడ ఉన్న వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించేందుకు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సయాని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి,మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) సి.ఎన్. రఘు ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ప్రత్యామ్నాయ స్థలాల అనుకూలతపై పరిశీలనలో భాగంగా ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపు కోసం జిల్లా కలెక్టర్ ముందుగా గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ ప్రాంతాలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు సందర్శించారు. ఆయా స్థలాల భౌగోళిక పరిస్థితులు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఏర్పాటుకు అనుకూలత, ప్రతిపాదిత తరలింపునకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎంఎంసీ కమిషనర్ గుర్తించిన ప్రత్యామ్నాయ స్థలాల వివరాలతో పాటు ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిస్థితులను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలుకు వివరించారు.ప్రజారోగ్యం, పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ హిందూ శ్మశానవాటిక ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన సమస్యలు, ప్రస్తుత స్థలం వినియోగంపై వ్యక్తమవుతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించే ప్రతిపాదనపై చర్చించారు.ప్రజల మనోభావాలు, ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసే అంశాలపై ఈ క్షేత్రస్థాయి పరిశీలన దృష్టి సారించింది. జిల్లా యంత్రాంగం గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు స్వయంగా పరిశీలించడం ద్వారా ప్రతిపాదిత తరలింపు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ పర్యటనలో ఆర్డిఓలు వెంకట్ రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు రాములు, మతిన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల అధికారి అవతారమేత్తిన ఎమ్మెల్యే





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ పాలనను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేకంగా రంగంలోకి దిగారు.ఇందులో భాగంగానే వార్డ్ 5 పరిధిలోని శేషాచల కాలనీలో ఉన్న రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో దుకాణం నిర్వహణ తీరును, రికార్డులను,నిల్వలను ఆయన పరిశీలించారు.

ఈ తనిఖీ సందర్భంగా కేవలం అధికారులతో సమీక్షలకే పరిమితం కాకుండా,అక్కడికి నిత్యావసర సరుకులు తీసుకోవడానికి వచ్చిన సామాన్య ప్రజలు, ముఖ్యంగా మహిళా లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్ నేరుగా ముచ్చటించారు.రేషన్ సరుకుల పంపిణీ తీరు ఎలా సాగుతోంది ?ప్రభుత్వం అందిస్తున్న బియ్యం నాణ్యత ఏ విధంగా ఉంది ? తూకంలో ఏమైనా తేడాలు వస్తున్నాయా ?లేదా డీలర్ల వైపు నుంచి ఎలాంటి ఇబ్బందులైనా ఎదురవుతున్నాయా ?అని వారిని ఆరా తీశారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలపై లబ్ధిదారులు సానుకూలంగా స్పందించారు.సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని వారు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తుండటం పట్ల మహిళలు హర్షం వ్యక్తంచేశారు.అలాగే, అర్హులైన పేద కుటుంబాలన్నింటికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియ కూడా ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.గత ప్రభుత్వాల హయాంలో రేషన్ సరుకుల కోసం పడిన పాట్లు ఇప్పుడు చాలావరకు తగ్గాయని,నాణ్యమైన సన్నబియ్యం తమ కుటుంబాలకు ఎంతో భరోసానిస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాగితాల మీదనే కాకుండా,నేరుగా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్క పేద కుటుంబానికి చేరాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ లక్ష్య సాధనలో భాగంగానే తాను తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నానని చెప్పారు.రేషన్ దుకాణాల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన డీలర్‌ను గట్టిగా హెచ్చరించారు.ప్రభుత్వం ప్రజల కోసం పంపిణీ చేస్తున్న సరుకులు ఏ ఒక్కరూ నష్టపోకుండా సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని గుర్తుచేశారు.ప్రజలకు నాణ్యమైన రేషన్ సరుకులు అందించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని,అది పేదల హక్కు అని ఆయన పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ప్రభుత్వ ఫలాలు సంపూర్ణంగా అందే వరకు నిరంతరం శ్రమిస్తామని, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు.

యువత ఉద్యోగాల వేట వీడి,స్వయం ఉపాధి వైపు అడుగులు వెయ్యాలి:

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ సమయం వృథా చేసుకోకుండా, యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. లాలాగూడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన"టీ స్టాల్"ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన యజమానులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ప్రస్తుతం ఆధునిక కాలంలో కేవలం ఉద్యోగాలపైనే ఆధారపడకుండా,చిన్న స్థాయి వ్యాపారాల ద్వారా కూడా తమ కాళ్లపై తాము నిలబడొచ్చని నిరూపించాలన్నారు. స్వయం ఉపాధి ద్వారా లభించే సంపాదన వ్యక్తిగత ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.సమాజంలో చిన్న వ్యాపారాలే అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

స్థానిక ప్రాంతాలలో ఇటువంటి నూతన వ్యాపారాలు ప్రారంభం కావడం వల్ల ఆ ప్రాంతం ఆర్థికంగా పురోగతి సాధించడంతో పాటు, భవిష్యత్తులో ఇతరులకు కూడా ఉపాధి కల్పించే అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు పట్టుదలతో, కష్టపడే తత్వంతో ముందడుగు వేస్తే వ్యాపార రంగంలో రాణించడం పెద్ద కష్టం కాదని భరోసానిచ్చారు. స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని వెతుక్కుంటున్న ప్రతి ఒక్క చిన్న వ్యాపారికి ప్రభుత్వ పరంగా, స్థానిక నాయకత్వం తరపున ఎల్లప్పుడు పూర్తి సహకారం ఉంటుందని భరోసా కల్పించారు.

జర్నలిస్టులపై దాడులు.. పోలీసుల దౌర్జన్యాలు

– వార్తా సేకరణలో విలేకరులపై చేయి చేసుకుంటారా – చిత్తూరు జిల్లా వి.కోటలో ఎన్‌టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై సీఐ దాడి

– సస్పెండ్ చేయాలని ఇబ్రహీంపట్నంలో జర్నలిస్టుల నిరసన



ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తున్న మీడియాపై దాడులు ఆగడం లేదు. విధి నిర్వహణలో భాగంగా వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులపై పోలీసులే దాడులకు పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చిత్తూరు జిల్లా వి.కోటలో పోలింగ్ కేంద్రం వద్ద వార్తా కవరేజీ చేస్తున్న ఎన్‌టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై సీఐ దాడి చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలని ఏపీపీజేఏ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవులు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై దాడులు చేయడం, వారి వార్తా సేకరణకు ఆటంకాలు కల్పించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులు చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు.

వార్త కవరేజీ చేస్తే దాడులా..

ప్రజలకు వాస్తవాలను నిష్పక్షపాతంగా అందించేందుకు జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని రాఘవులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం మీడియా బాధ్యత అని, ఆ విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు, జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పోలీసులు ఇలా వ్యవహరించడం ఖండించదగినదన్నారు.వి.కోటలో ఎన్‌టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై దాడి చేసిన సీఐపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసనతో జర్నలిస్టుల ఐక్యత చాటింపు..

ఇబ్రహీంపట్నంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మైలవరం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టంగుటూరి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ సల్మాన్, జిల్లా కమిటీ సభ్యులు వేముల నాగరాజు, పల్లె నరేష్, ఏపీ బీజేఏ మైలవరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసి ప్రతాప్, కోశాధికారి కాలగడ్డ మనోహర్, ఉపాధ్యక్షులు మల్లాటి రమేష్, సభ్యులు బి.వంశీ, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, విధి నిర్వహణలో ఉన్న విలేకరులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు సంఘటితంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

పవిత్రోత్సవాల్లో పవిత్ర సమర్పణ.. వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి సేవలు

– శ్రీనివాసమంగాపురంలో రెండో రోజు వైదిక క్రతువులు – స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు

తిరుపతి(ప్రశ్న న్యూస్) పవిత్రోత్సవాల వేళ.. కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో వైదిక వైభవం! శ్రీనివాసమంగాపురం ఆలయంలో పవిత్రోత్సవాలు రెండో రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి ప్రత్యేక పూజలు, స్నపన తిరుమంజనం నిర్వహించి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. వేద మంత్రోచ్చారణలు, అభిషేకాలు, వైదిక క్రతువులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఉదయం సుప్రభాతంతో స్వామివారి సేవలు ప్రారంభమయ్యాయి. తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పంచామృతాలతో అభిషేకం..

ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో స్వామివారికి అభిషేకం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు మూలవర్లకు, ఉత్సవమూర్తులకు పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆగమోక్త విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారు, అమ్మవార్లకు పవిత్రాలను సమర్పించి పూజలు చేశారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి.

మాడ వీధుల్లో స్వామివారి విహారం..

పవిత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ధనశేఖర్, మునికుమార్, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



CHANGE OF NAME

I, **NUKALA PRABAL TEJA** S/o **NUKALA MAHENDER** R/o H.No. 1-24-112, Indira Nagar Colony, Venkatapuram, Secunderabad - 500015, my name has been recorded as **NUKALA PRABALL** in my all documents while my correct name **NUKALA PRABAL TEJA** is mentioned in my all documents. Both the **NUKALA PRABALL** & **NUKALA PRABAL TEJA** is one and the same person.

జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్లకు సిఎస్ ఆదేశాలు



మేడ్చల్(ప్రశ్న న్యూస్) జిల్లా కలెక్టర్లు మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం, ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పిలుపునిచ్చారు. విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, భూసేకరణ తదితర శాఖలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, కలెక్టర్లు జిల్లాల్లోని విద్యాసంస్థలు, ఆసుపత్రులు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని అభినందించారు. ఇటీవల తుఫాను ప్రభావంతో చోటుచేసుకున్న ప్రమాద సమయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ సకాలంలో స్పందించి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రక్షించిన తీరును ప్రత్యేకంగా అభినందించారు. తాగునీటి సమస్య తలెత్తకూడదని ఎల్‌నినో నేపథ్యంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జలసిరి పథకం కింద ఫామ్ పాండ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్రంలో చేయూత పథకం కింద వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు సంబంధించి మొత్తం 5.9 లక్షల దరఖాస్తులు అందాయని, వీటిలో 38 వేల దరఖాస్తులు మినహా మిగిలిన అన్నింటి పరిశీలన పూర్తయిందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనను నవంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా మంజూరు చేసిన 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఒక బస్తా సిమెంట్ ధరను రూ.230గా నిర్ణయించినందున, లబ్ధిదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా చూడాలని సూచించారు. అదేవిధంగా, గనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మన ఇసుక వాహనం' ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, రవాణా శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్, వివిధ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసు ఇవ్వకుండానే సస్పెన్షన్..

మంత్రి శ్రీధర్ బాబుపై టిపిసిసికి మంథని కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



మంథని (ప్రశ్న న్యూస్)మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే సస్పెన్షన్ విధించామని మండల అధ్యక్షుడు శ్రీనివాస్ చెప్పినట్లు నేతల ఆరోపణతమ వివరణ తీసుకోకుండా, ఎలాంటి షోకాజ్ నోటీసు జారీ చేయకుండానే సస్పెన్షన్ ఎలా విధిస్తారని ప్రశ్నమంథని కాంగ్రెస్‌లో సస్పెన్షన్ల సెగ.. చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సస్పెన్షన్ల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. తమపై ఎలాంటి షోకాజ్ నోటీసు జారీ చేయకుండా, వివరణ తీసుకోకుండానే సస్పెన్షన్ విధించడంపై బాధిత కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు, పార్టీ క్రమశిక్షణా సంఘం కమిటీకి ఫిర్యాదు లేఖ అందజేశారు.ఈ సందర్భంగా బాధిత నేతలు కీలక ఆరోపణలు చేశారు. మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తమను సస్పెండ్ చేసినట్లు తెలియజేస్తూ, మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారని తమ ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు. అసలు తమకు ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, తమ వివరణ తెలుసుకోకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.మల్లారం గ్రామంలో నిరుపేద పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసే సేవా కార్యక్రమంలో పాల్గొంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అని వారు ప్రశ్నించారు. స్థానిక రాజకీయాలు, తప్పుడు సమాచారంతోనే తమపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తాము కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం కష్టపడే నాయకులపై ఇలాంటి ఏకపక్ష చర్యలు తీసుకోవడం పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిణామాల వల్ల ప్రత్యర్థి పార్టీలకు రాజకీయంగా లాభం చేకూరే ప్రమాదం ఉందని పేర్కొంటూ, పార్టీ అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని తమపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయాలని బాధిత కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

టపాసుల అక్రమ వ్యాపారం చేస్తే ఖబడ్దార్

- అనుమతులు లేకుండా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు



నంద్యాల : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు. పేలుడు పదార్థాల చట్టం ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.దీపావళి టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, జనసంచారం, నివాస ప్రాంతాలకు దూరంగా బహిరంగ మైదానాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని, చిన్నపిల్లలను విక్రయ పనుల్లో నియమించరాదన్నారు.అక్రమ నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ టపాసుల విక్రయాల సమాచారం తెలిస్తే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

ధన్వంతరి జయంతి వేళ సంప్రదాయ వైద్య విజ్ఞానానికి కొత్త వెలుగు

ఔషధ మొక్కల విజ్ఞాన శిక్షణ కేంద్రం ప్రారంభం, పరంపర వైద్యులకు నూతన దిశ



ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్) భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతి సందర్భంగా ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం కేంద్ర కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల విజ్ఞాన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ధన్వంతరి ప్రార్థన, పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ వేడుకలో సంప్రదాయ వైద్య విజ్ఞాన పరిరక్షణ, ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ఆయుర్వేద జీవన విధానం, జీవవైవిధ్య సంరక్షణ తదితర అంశాలపై సమగ్ర చర్చ జరిగింది.ప్రత్యేక ఆహ్వానితులు, సంఘ ప్రముఖులు, కార్యవర్గ సభ్యులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం భవిష్యత్తులో సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి చేయడానికి ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది.

సంప్రదాయ విజ్ఞానానికి శాస్త్రీయ దృక్పథం

ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణ స్వామి మాట్లాడుతూ, మన పూర్వీకులు అందించిన సంప్రదాయ వైద్య విజ్ఞానం, ఔషధ మొక్కల పరిజ్ఞానం అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ఈ జ్ఞానాన్ని సేకరించడం, నమోదు చేయడం, బాధ్యతాయుతంగా అధ్యయనం చేయడం ద్వారా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని వివరించారు.ఆయుర్వేదం కేవలం ఔషధాల వినియోగానికి మాత్రమే పరిమితం కాదని, ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానం, ఔషధ మొక్కల పరిజ్ఞానం వంటి విస్తృతమైన అంశాలను కలిగి ఉందని తెలిపారు.ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటికే అనుభవం ఉన్న సంప్రదాయ వైద్యులకు మరింత విజ్ఞానాన్ని అందించడంతో పాటు, కొత్తగా ఆయుర్వేదం, మూలికా వైద్యం నేర్చుకోవాలనుకునే వారికి ప్రాథమిక స్థాయి నుంచి క్రమబద్ధమైన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.ఔషధ మొక్కల గుర్తింపు, వాటి లక్షణాలు, పెంపకం, సంరక్షణ, సంప్రదాయ వినియోగం, ఆయుర్వేద మౌలిక సూత్రాలు, శాస్త్రీయ పరిశీలన వంటి అంశాల్లో దశలవారీగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.అనుభవజ్ఞులైన సంప్రదాయ వైద్యులు, ఆయుర్వేద నిపుణులు, పరిశోధకులు, ప్రకృతి పరిరక్షణ రంగ ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు, అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

జీవవైవిధ్య పరిరక్షణలో సంప్రదాయ వైద్యుల పాత్ర

సంప్రదాయ వైద్యుల వద్ద తరతరాలుగా సంక్రమించిన ఔషధ మొక్కల పరిజ్ఞానం జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని లక్ష్మణ స్వామి పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు విస్తృతంగా కనిపించిన అనేక ఔషధ మొక్కలు నేడు కనుమరుగయ్యే పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, వాటి గుర్తింపు, సంరక్షణ, పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు వైద్యుల అనుభవాలను నమోదు చేయడం అవసరమని తెలిపారు.ప్రకృతిని కాపాడటం, స్థానిక వృక్షజాతులను సంరక్షించడం, ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం కూడా సంప్రదాయ వైద్య పరిరక్షణలో భాగమని వివరించారు.

ప్రాచీన ఆయుర్వేద జీవన విధానాన్ని భావితరాలకు అందించాలి

ఈ సందర్భంగా నిరామయ సంస్థ వ్యవస్థాపకులు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాచీన ఆయుర్వేద జీవన విధానంలో వైద్య విజ్ఞానంతో పాటు "ఆహారమే ఔషధం" అనే గొప్ప ఆరోగ్య సూత్రానికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. అలనాటి మహర్షులు, ఋషులు తమ అపారమైన ఆయుర్వేద జ్ఞానాన్ని మానవాళి సంక్షేమం కోసం అందించారని, అటువంటి విలువైన విజ్ఞాన సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.ఈ దిశగా సింహాచలం లక్ష్మణ స్వామి చేస్తున్న ప్రయత్నాన్ని తాము హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కాలంగా లక్ష్మణ స్వామితో కలిసి పనిచేస్తూ పలు కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నామని, ఆయన చేపట్టిన ఈ నూతన విజ్ఞాన శిక్షణ కేంద్రం ఏర్పాటు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఇలాంటి విజ్ఞానపరమైన కార్యక్రమాలు ఒక్క ప్రారంభోత్సవానికే పరిమితం కాకుండా నిరంతరం, క్రమం తప్పకుండా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర ప్రయత్నానికి తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని నరేందర్ రెడ్డి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో నిరామయ సంస్థ వ్యవస్థాపకులు నరేందర్ రెడ్డి, అమెరికా నుంచి విచ్చేసిన ఎన్నారై జయంతి రెడ్డి, ఆర్గానిక్ ఇంటెలిజెన్సీ వ్యవస్థాపకులు నరసింహా, ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం కోశాధికారి జిందం కమలాకర్, సంఘ కార్యవర్గ సభ్యులు చింతపాటి జగన్మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘ కోశాధికారి జిందం కమలాకర్ మాట్లాడుతూ సంప్రదాయ వైద్య రంగ అభివృద్ధి కోసం సింహాచలం లక్ష్మణ స్వామి చేస్తున్న కృషిని అభినందించారు.సంఘ కార్యకలాపాలకు, సంప్రదాయ వైద్య శిక్షణకు తన ప్రాంగణాన్ని ప్రత్యేకంగా కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆశయసాధన కలిగిన వ్యక్తితో కలిసి పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు.సంప్రదాయ వైద్యులకు సముచిత గుర్తింపు, గౌరవం లభించే స్వర్ణయుగం రావాలనే లక్ష్యంతో లక్ష్మణ స్వామి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు.

సంఘ కార్యవర్గ సభ్యులు చింతపాటి జగన్మోహన్ రాజు కూడా లక్ష్మణ స్వామి సేవలను ప్రశంసిస్తూ, సంప్రదాయ వైద్య విజ్ఞాన పరిరక్షణకు ఈ శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

ప్రకృతి వ్యవసాయం.. సహజ ఆహారంపై అవగాహన

ఆర్గానిక్ ఇంటెలిజెన్సీ వ్యవస్థాపకులు నరసింహా మాట్లాడుతూ, ప్రకృతి ప్రసాదించిన సంపదను కాపాడుకుంటూ సేంద్రియ వ్యవసాయం, ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.మూలికలతో కూడిన సహజ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రకృతికి మేలు చేసే వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుందని వివరించారు.ప్రకృతిని ప్రేమిస్తూ సమాజానికి ఉపయోగపడే ఆశయాలతో పనిచేసే వ్యక్తులతో పరిచయం ఏర్పడటం, కలిసి ముందుకు సాగేందుకు అవకాశం లభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఔషధ మొక్కల తోటలో ప్రత్యక్ష పరిచయం

కార్యక్రమంలో మరో ప్రత్యేక ఆకర్షణగా సింహాచలం లక్ష్మణ స్వామి తన మేడపై పెంచుతున్న ఔషధ మొక్కల తోటను మీడియా ప్రతినిధులు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులకు పరిచయం చేశారు.

అక్కడ పెంచుతున్న వివిధ రకాల ఔషధ మొక్కలను ఒక్కొక్కటిగా చూపిస్తూ వాటి గుర్తింపు, వృక్ష లక్షణాలు, పెంపకం పద్ధతులు, సంప్రదాయ ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యక్షంగా మొక్కలను పరిశీలిస్తూ వాటి గురించి తెలుసుకునే అవకాశం కల్పించడం సందర్శకులను ఆకట్టుకుంది.

భవిష్యత్తులో నిరంతర విజ్ఞాన కార్యక్రమాలు

ఈ కేంద్రం ద్వారా ప్రతి ఆదివారం లేదా ముందుగా ప్రకటించే షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక విజ్ఞాన సమావేశాలు, ఔషధ మొక్కల పరిచయ కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది.కొత్తగా నేర్చుకోవాలనుకునే వారికి ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇవ్వడం, అనుభవజ్ఞులైన సంప్రదాయ వైద్యులకు మరింత విజ్ఞానాన్ని అందించడం, ప్రముఖుల అనుభవాలను భావితరాలకు చేరవేయడం ప్రధాన కార్యాచరణగా ఉండనుంది.శిక్షణను నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పూర్తిచేసిన వారికి కార్యక్రమ అర్హతలకు అనుగుణంగా ధ్రువీకరణ పత్రాలు అందించే విధానాన్ని కూడా రూపొందించనున్నారు.

సంప్రదాయ వైద్య రంగానికి ఒక కొత్త అధ్యాయం

ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ విజ్ఞాన కేంద్రం సంప్రదాయ వైద్య పరిజ్ఞాన పరిరక్షణకు, ఔషధ మొక్కల సంరక్షణకు, శాస్త్రీయ అవగాహన పెంపొందించడానికి ఒక ప్రత్యేక వేదికగా నిలవనుంది.అనుభవజ్ఞులైన వైద్యుల విజ్ఞానాన్ని భావితరాలకు అందించడం, కొత్తవారికి శిక్షణ ఇవ్వడం, ప్రకృతి పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో సంఘం చేపట్టిన ఈ ప్రయత్నం భవిష్యత్తులో మరిన్ని విలువైన కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆకాంక్షించారు. జ్ఞానాన్ని పరిరక్షించడం మన బాధ్యత.. ప్రకృతిని కాపాడటం మన కర్తవ్యం.. భావితరాలకు విజ్ఞానాన్ని అందించడం మన సంకల్పం.



ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం
వ్యవస్థాపక అధ్యక్షులు: సింహాచలం లక్ష్మణ స్వామి
సౌజన్యం: వీరాంజనేయ ఆయుర్వేద ఫార్మసీ
నారపల్లి, 90001 87858 హైదరాబాద్
www.ayurvahini.com

శ్రీశైలంలో భక్తి వైభవం.. అంకాళమ్మకు విశేష పూజలు

లోకకల్యాణమే లక్ష్యం.. స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ

- నందీశ్వరుడికి అన్నాభిషేకం

- నిత్యకళారాధనలో నృత్య ప్రదర్శనలు

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి.. భక్తి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం కళకళ లోకకల్యాణం, ప్రజల సుఖశాంతులు, దేశ సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం శుక్రవారం ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించింది. గ్రామదేవత అంకాళమ్మకు విశేష అభిషేకాలు.. స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ.. నందీశ్వరుడికి ప్రత్యేకార్చనలు.. మరోవైపు నిత్యకళారాధన వేదికపై సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాటయ్యాయి.

అంకాళమ్మకు విశేష అభిషేకాలు..

శ్రీశైల క్షేత్ర గ్రామదేవత శ్రీ అంకాళమ్మవారికి శుక్రవారం ఉదయం దేవస్థానం సేవగా విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ చేసి, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పం పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలంతో విశేష అభిషేకాలు నిర్వహించారు.అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు సమర్పించారు. శ్రీశైల ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న రహదారి చివర కుడివైపున ఉత్తరముఖంగా అంకాళమ్మ ఆలయం కొలువై ఉంది. ప్రకృతి శక్తుల స్వరూపమే గ్రామదేవతలని ఆర్షవాఙ్మయం పేర్కొంటుందని దేవస్థానం వివరించింది. చతుర్భుజాలతో దర్శనమిచ్చే అంకాళమ్మవారి చేతుల్లో కత్తి, సర్పంతో చుట్టబడిన డమరుకం, పాసపాత్ర, త్రిశూలం ఉంటాయి. కిరీట మకుటం, వస్త్రాలు, కర్ణాభరణాలు, కంఠాభరణాలతో అమ్మవారు అలంకృతులై ఉంటారు.

స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ..

లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం శ్రీశైల మల్లికార్జున స్వామివారు, భ్రమరాంబ అమ్మవారికి ఊయలసేవ నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలానక్షత్రం రోజుల్లో ఈ సేవ నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.సేవలో భాగంగా ముందుగా అర్చకులు సంకల్పం పఠించి, కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహిస్తారు. అనంతరం



ఊయలలో వేంచేపు చేయించిన స్వామి, అమ్మవార్లకు షోడశోపచార పూజలు నిర్వహించి, విశేష పుష్పాలంకరణ, పుష్పార్చనలతో ఊయలసేవ సమర్పిస్తారు.

నందీశ్వరుడికి అన్నాభిషేకం..

త్రయోదశి ఘడియలను పురస్కరించుకుని నందీశ్వరస్వామివారికి దేవస్థానం ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించింది. లోకక్షేమం, దేశ శాంతిసౌభాగ్యాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో వర్షాలు కురవడం, పంటలు సమృద్ధిగా పండడం, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని అర్చకులు, వేదపండితులు సంకల్పం పఠించారు.అనంతరం మహాగణపతి పూజ నిర్వహించి నందీశ్వరుడికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకంతో పాటు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం చేశారు.వృషభసూక్తం తదితర వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా విశేషాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలు సమర్పించి, పుష్పార్చనలు, అన్నాభిషేకం చేశారు. నానబెట్టిన శనగలను సమర్పించి చివరగా నివేదన నిర్వహించారు.



నిత్యకళారాధనలో నృత్య ప్రదర్శనలు..

దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ద్రోణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డాన్స్ కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇవ్వసున్నారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై శుక్రవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మహాగణపతిం, శివశంభో, జతిస్వరం, శివపాదమంజీరనాదం, నాగేంద్రహారాయ, మహిషాసుర మర్ధిని, శివతాండవం, శంభో శివ శంభో తదితర గీతాలకు నిత్య, లిఖిత, హిమశ్రీ, సహస్ర, కోమలి, వైష్ణవి, మనోజ్ఞ, దీక్షిత తదితర కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు.హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలతో నిత్యకళారాధన కొనసాగుతోంది. స్వామి, అమ్మవార్ల కైంకర్యాలు పరిపూర్ణంగా జరగడంతో పాటు ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని దేవస్థానం తెలిపింది.

వరుస దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా

- మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరో నిందితుడి కోసం గాలింపు

- సంగారెడ్డి జిల్లాలో మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించిన సంగారెడ్డి పోలీసులు

- ఎయిర్ పిస్టల్ (నకిలీ తుపాకీ), 2-కత్తులు, నేరాలకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, ఇతర వస్తువులు స్వాధీనం

- నిందితులపై మహారాష్ట్రలో గతంలోనూ పలు దొంగతనాలు, దోపిడీ కేసులు నమోదు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి జిల్లాలో నమోదైన వరుస దారి దోపిడీ కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఆదేశాల మేరకు సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి, జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65-ఎ పై జరిగిన మరో దారి దోపిడీ కేసును ఛేదించడం జరిగింది.

ఈ కేసులకు సంబంధించి మహారాష్ట్రకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.ముగ్గురు నేరస్తులు నేరం చేయడానికై మహారాష్ట్ర నుంచి యమహా బ్లూ కలర్ నెంబర్ ప్లేట్ లేని బైక్ పై బయలుదేరి నల్లని మాస్క్, స్వెట్టర్ లు, 2-కత్తులు బ్యాగ్ లో పెట్టుకొని, మరో వ్యక్తి ఎయిర్ పిస్టల్ ను కనబడకుండా దాచి పెట్టుకొని, తెలంగాణ వైపు వస్తుండగా, చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్డి చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని యమహా బ్లూ కలర్ ఆర్ 15 బైక్ పై అనుమానాస్పదంగా కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, సంగారెడ్డి జిల్లాలో జరిగిన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని హుమ్నాబాద్‌లో జరిగిన మరో దారి దోపిడీ కేసులో తమ ప్రమేయాన్ని వెల్లడించారు.

చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల నంద్యాలలో జిల్లాస్థాయి మూడవ ర్యాంకింగ్ చెస్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హనీఫ్ నగర్‌లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ఆర్‌జీ చెస్ అకాడమీ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని, చదరంగం ఆలోచనా శక్తి, విశ్లేషణ నైపుణ్యాలను పెంపొందిస్తుందని తెలిపారు.జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 12 వయసు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి విభాగంలో 10 చొప్పున మొత్తం 120 బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఐదు జిల్లాస్థాయి ర్యాంకింగ్ పోటీల ద్వారా ప్రతిభావంతులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుష్మ, క్యాంపస్ ఇన్‌చార్జి నస్రీన్, చీఫ్ ఆర్బిటర్ సుజాత, నిర్వాహకులు అరుణ్ కుమార్, శాంతినికేతన్ సురేష్, మాధవి, రమ్య, కోచ్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 23న వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

-18న నోటీసులు జారీ

నంద్యాల నంద్యాల మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని మీడియా ప్రతినిధులకు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 18న ప్రత్యేక సమావేశానికి సంబంధించి నోటీసులు జారీ చేయనున్నారు. నవంబర్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను చట్ట నిబంధనలు, ఎన్నికల నియమావళికి అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన

కార్యక్రమంలో మంత్రి వివేక్



మంచిర్యాల మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. చెన్నూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదలు, కార్మికులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం.ప్రతి అర్హుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే మా బాధ్యత. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా నిరంతర లక్ష్యమని అన్నారు.

మరో భర్త హతం

ప్రియుడి మోజులో పడి భర్తను హతమార్చిన భార్య

జయశంకర్ భూపాలపల్లి భార్య చేతిలో హత్యకు గురయిన జాబితాలో మరో భర్త చేరాడు. గొల్లబుద్దారం గ్రామంలో సంతోష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని, భార్య పావనిభర్త అజ్మీర చందు (30)ను హతమార్చింది. ప్రియుడితో కలిసి హత్య చేసి, ఎడ్లబండిపై మృతదేహాన్ని చికెన్‌పల్లి సమీపంలో నిందితురాలు పడేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న ప్రియుడు సంతోష్, భార్య పావని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సివిల్ సప్లై అధికారుల తనిఖీలు..

- ధరల పట్టిక ప్రదర్శించాలని ఆదేశాలు

హైదరాబాద్ : సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నాడు మెహిదీపట్నం లో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అధికారిణి బుష్రా సుల్తానా నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. నిత్యావసర వస్తువుల అమ్మకాలను అధికారుల బృందం పరిశీలించింది. పలు దుకాణాల్లోని సరకులకు వున్న రేట్ లేబుళ్లను తొలగించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఖచ్చితంగా ప్రభుత్వ ధరలకే అమ్మకాలు చేయాలని అన్నారు.

ఎఫ్ఎంజీ వైద్యుల అరెస్టు... కోఠిలో ఉద్రిక్తత

హైదరాబాద్ హైదరాబాద్ కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు ఎఫ్ఎంజీ వైద్యులు ఆందోళనకు దిగారు. తమ డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్న వైద్యులను పోలీసులు అడ్డుకున్నారు. వైద్యులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఎంజీ డాక్టర్లు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నెలకు రూ. 29,792 స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చరేసారు. జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆందోళనకు దిగారు . తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతుంటే పోలీసులతో అడ్డుకుంటున్నారని వైద్యులు ఆవేదన వ్యక్తం చేపారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్ కానిస్టేబుల్

భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలం పట్టణంలో ఒక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యను హతమార్చి గోదావరి లో పడేసాడు. కానిస్టేబుల్ నరేందర్ ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే హత్య చేసాడు. నరేందర్ కు భవాని సోషల్ మీడియా ద్వారా పరిచయమైయింది. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఎనిమిది నెలల క్రితం పాప జన్మించగా ఆ తర్వాత చిన్నారి చనిపోయింది. తరువాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో నరేందర్ భార్యను హతమార్చి మృతదేహాన్ని గోదావరిలో పడేసాడు.విషయం తెలిసిన పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో భవాని మృతదేహం కోసం గాలిస్తున్నారు. భార్యను హత్య చేయడానికి దారితీసిన కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలకు

అనుమతులు తప్పనిసరి

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,

విజయనగరం దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా ప్రేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా బాణసంచా నిల్వ ఉంచే గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక బాణసంచా విక్రయ షాపుల వద్ద వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టే విధంగా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఆదేశించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాణసంచా విక్రయించేందుకు విక్రయదారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు తమ షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండే విధంగాను, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలన్నారు. అనుమతులు ఉన్న షాపుల నుండి మాత్రమే తాత్కాలిక లైసెన్సులు పొందిన విక్రయదారులు బాణసంచాను కొనుగోళ్ళు చేయాలన్నారు. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు, ఫైర్ నియంత్రికలను అందుబాటులో ఉంచాలన్నారు. మతాబు షాపుల వద్ద ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండి ఒకేసారి కొనుగోలు చేయకుండా చూసుకోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న వస్తువులు, దగ్గరలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ం

అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను తాత్కాలిక షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మనుష్యులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచాను రవాణ చేయకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండే మెటీరియల్ మాత్రమే అనగా ఆస్బెస్టాస్, జి.ఎస్.రేకులతో తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలు, నిల్వలు ఉంచే షాపులు, గోడౌన్లు వద్ద వెలుగు ఉండే విధంగాను, లోపలకు, బయటకు వెళ్ళేందుకు వేర్వేరు ద్వారాలు ఉండే విధంగా చూడాలన్నారు. గోడౌన్లులో సురక్షితమైన వైరింగు, ఫైర్ అలారమ్స్ ఉండే విధంగా షాపు యజమానులు చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు.మతాబులు విక్రయించే షాపులు, నిల్వ ఉండే గోడౌన్లు, తాత్కాలిక షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పని సరిగా పాటించాలని, లైసెన్సులో అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించే విధంగా చూడాలన్నారు. బాణసంచా వ్యాపారుల తాత్కాలిక లైసెన్సుల గడువు ముగిసిన తరువాత మిగిలిన బాణసంచాను నిబంధన లకు అనుగుణంగా రూపొందించిన గోడౌన్స్ లోనే భద్రపర్చుకోవాలని, జనావాసాల్లోను, ఇండ్లలోను భద్రపర్చవద్దన్నారు. నిబంధనలు, భద్రత ప్రమాణాలను అతిక్రమించిన వారిపైన, జనావాసాల్లో బాణసంచాను భద్రపర్చిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీఆదేశించారు.

దీపా లక్ష్మీ కటాక్షం దీపావళి... నేటి నుండే

రెండు రోజులపాటు జరుగు దీపావళికి సర్వం సిద్ధం

మొదటిరోజు : నరక చతుర్దశి (చోటి దీపావళి)

రెండో రోజు : దీపావళి (అమావాస్య రోజు)



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) దీపా లక్ష్మీ కటాక్షం దీపావళికి సర్వం సిద్ధమైంది. దక్షిణ భారతదేశంలో ప్రధానంగా దీపావళి రెండు రోజులపాటు జరుపుకుంటారు. మొదటిరోజు నరక చతుర్దశి, రెండో రోజు దీపావళి (అమావాస్య రోజు) శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో భీకర రాక్షసుడైన నరకాసురుడిని వధించిన రోజే నరక చతుర్దశి. నరకాసురుడి భార్యనుండి లోకానికి బందిలైన స్త్రీలకు విముక్తి కలిగిన సందర్భం ఇది. చెడుపై మంచి సాధించిన విజయానికి ఇది ప్రతీక. మొదటి రోజు తెల్లవారుజామున నూనె రాసుకుని తలంటుకొని స్నానం చేయడం చాలా ప్రత్యేకమైన ఆచారం. నూనెలో లక్ష్మీదేవి నీటిలో గంగాదేవి నివసిస్తారనిప్రజలు నమ్ముతారు. సాయంత్రం వేళ ఇండ్ల ముందు దేవుడి గదిలో దీపాలు వెలిగిస్తారు. నరకుడి పేరున నాలుగు వత్తులతో దీపం పెట్టి పూజిస్తారు. రెండో రోజు దీపావళి. 14 సంవత్సరాల అజ్ఞాతవాసం వనవాసం పూర్తిచేసుకుని రావణుడిని సంపాదించిన తర్వాత శ్రీరాముడు సీతా సమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు ఇదే. ఆనందంలో అయోధ్య ప్రజలు నెయ్యి దీపాలు వెలిగించి స్వాగతం పలుకుతారు. ఈ అమావాస్య రోజున సంపదలకు దేవత అయిన మహాలక్ష్మిని పూజిస్తే ఏడాది పొడవున్న సిరిసంపదలు కలుగుతాయని ప్రజలు విశ్వసిస్తారు. వ్యాపారులు కొత్త పుస్తకాలు (ఖాతాలు) ప్రారంభించడానికి ఈరోజును శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున ఇండ్లకు మామిడి తోరణాలు ముగ్గులతో అలంకరించి దీపాలు వెలిగిస్తారు కుటుంబ సభ్యులు అంతా కలిసి లక్ష్మీ పూజ చేసుకొని మిఠాయిలు తింటూ బాణసంచ కాల్చి ఆనందంగా గడుపుతారు.

రెండు రోజులపాటు జరుగు దీపావళికి సర్వం సిద్ధం

రెండు రోజులపాటు జరుగు దీపావళికి సర్వం సిద్ధమైంది. బాణాసంచా కోసం దుకాణాలు వెలిశాయి. దీపా లక్ష్మీ కటాక్షం కోసం ప్రజలు సిద్ధపడుతున్నారు. వ్యాపార వాణిజ్య సంస్థలలో లక్ష్మీ పూజ చేసుకునేందుకు వ్యాపారస్తులు సిద్ధపడుతున్నారు. ఇందుకోసం షాపులను శుభ్రం చేసుకుంటూ షాపుల ముందు బాణాసంచా కాల్చేందుకు సిద్ధం అవుతున్నారు.

టపాసులు ప్రకృతికి, మనుషులకు హానికరం

ప్రత్యామ్నాయాలతో పండుగలు జరుపుకోవాలి

జే వి వి ప్రసాదరావు



మేడ్చల్(ప్రశ్న న్యూస్)పండుగల పేరుతో కాల్చే బాణాసంచా ఆనందాన్ని కాదు, విషపు మేఘాన్ని మిగులుస్తోందని జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా నాయకుడు వి.వి. ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. టపాసులు పేలినప్పుడు విడుదలయ్యే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్, భారీ లోహాలు గాలిని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయని తెలిపారు. ఒక్క దీపావళి రాత్రికే పీఎం2.5 స్థాయి అనేక రెట్లు పెరిగి ఆస్తమా, బ్రోన్కైటిస్, గుండె జబ్బులు, కంటి మంటలు పెరుగుతున్నాయని, చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.100 నుంచి 140 డెసిబెల్స్ వరకు వచ్చే శబ్ద కాలుష్యం మనుషులకే కాక, మూగజీవాలకు ప్రాణ సంకటంగా మారుతోందని, కుక్కలు, పిల్లలు భయంతో పారిపోవడం, పక్షులు గూళ్లు వదిలి వెళ్లిపోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఏటా వేలాది మంది పిల్లలు కాలిన గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారని గుర్తు చేశారు.పండుగ అంటే శబ్దం, పొగ కాదని, కలిసి ఆనందించడం, ప్రకృతిని కాపాడడం అని ఆయన అన్నారు. టపాసుల కాంతి కొన్ని సెకన్లు మాత్రమే ఉంటుందని, కానీ దాని విష ప్రభావం తరతరాలకు మిగిలిపోతుందని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయాలు పాటించాలి

బాణాసంచాకు బదులు దీపాల అలంకరణ, విద్యుత్ దీపాలు, లేజర్ షోలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వాలు నిషేధిత రసాయనాలు కలిగిన టపాసులను పూర్తిగా నిషేధించి కఠిన నిబంధనలు అమలు చేయాలని, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. సొసైటీలు, అపార్ట్‌మెంట్లలో కూడా నిషేధం విధించాలని, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచే దుష్ఫలితాలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.బాణాసంచా లేని, కాలుష్యం లేని, ప్రమాదం లేని పండుగే నిజమైన ఆనందమని, ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తును కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

ఈఎస్ఐలో రూ.50 కోట్ల కుంభకోణం

- ఏసీబీ విచారణకు డిమాండ్

- పారిశుద్ధ్య కాంట్రాక్టుల్లో భారీ అవినీతి

- జాయింట్ డైరెక్టర్ గౌతమ్ ను తొలగించాలి: వేముల మారయ్య



నాచారం (ప్రశ్న న్యూస్)కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ వైద్య వ్యవస్థలో భారీ అవినీతి చోటుచేసుకుంటోందని ఈఎస్ఐసీ బోర్డు సభ్యుడు, భారత ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య ఆరోపించారు. శుక్రవారం హెచ్ఎంటీ నగర్ లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టుల పేరుతో సుమారు రూ.50 కోట్ల మేర అక్రమాలు జరిగాయని, ఒక్క ప్రస్తుత సంవత్సరంలోనే రూ.30 కోట్ల కుంభకోణం చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు

ఐఎంఎస్ జాయింట్ డైరెక్టర్ గౌతమ్ తనకు నచ్చిన వ్యక్తులకు నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు కట్టబెడుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.10 వరకు ఉన్న పారిశుద్ధ్య నిర్వహణ వ్యయాన్ని ప్రస్తుతం రూ.72 నుంచి రూ.136 వరకు పెంచి చెల్లిస్తున్నారని విమర్శించారు. ఆన్ లైన్ టెండర్లు, పారదర్శక ఒప్పందాలకు బదులుగా నచ్చిన వారికి పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు.నాచారం, జీడిమెట్ల, పటాన్ చెరు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లోని ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల పారిశుద్ధ్య కాంట్రాక్టుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

వైద్య సేవల్లోనూ నిర్లక్ష్యం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది, హైదరాబాద్ లోనే 15 లక్షల మంది కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారని మారయ్య తెలిపారు. కార్మికులు, యాజమాన్యాలు చెల్లిస్తున్న నిధులతో మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్ బాధితులకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడం, సనత్ నగర్ ఈఎస్ఐ ఆసుపత్రితో పాటు ఇతర కేంద్రాల్లో సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షల సదుపాయాలు లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.
అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్య పరీక్షలు వెంటనే నిర్వహించకుండా మరుసటి రోజు రావాలని చెబుతున్నారని,



దీనివల్ల రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మిర్యాలగూడలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీకి అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేయగా, వైద్యం కోసం వచ్చిన కార్మికులు ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకాకుండా ప్రైవేటు క్లినిక్ లపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

అవినీతిపై ఉద్యమం ఉధృతం..

ఈఎస్ఐలో జరుగుతున్న అవినీతి, వైద్య సేవల్లో వైఫల్యాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని మారయ్య డిమాండ్ చేశారు. జాయింట్ డైరెక్టర్ గౌతమ్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, సంబంధిత ఉన్నతాధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ఏసీబీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ బంధాల ముసుగులో దోపిడి

- చోరీ సొత్తుతో మల్కాజిగిరి నుంచి గుంటూరు - హైదరాబాద్ వరకు.. బంగారు బాటలో దొంగల ప్రయాణం

- శత్రువులు ఎక్కడో ఉండరు చుట్టాల రూపంలో మన చుట్టే ఉంటారని చెప్పకనే చెబుతోంది "నేరేడ్ మేట్ లో చోరీ కేసు"

- రీల్ లైఫ్ ని"రియల్ లైఫ్ లో కి స్వాగతిస్తున్న బందువులు.పెద్దమ్మ ఇంట్లో చెల్లెలు కూతురు చోరీకి వ్యూహం.

హైదరాబాద్(ప్రశ్న న్యూస్)కుటుంబ సభ్యుల మధ్య ఉండే నమ్మకం ఎలాంటి షరతులు లేకుండా ఉంటాయి,"నా వెనుక నా కుటుంబం ఉంది"అనే ధైర్యం ప్రతి ఒక్కరికీ జీవితంలో ముందుకు వెళ్లే శక్తినిస్తుంది.అలాగే కుటుంబం అంటే సంస్కారాన్ని,విలువలను నేర్పే మొదటి పాఠశాల, అలాంటిది కుటుంబమే నేరానికి పునాది అయితే సమాజం సురక్షితంగా ఉండదు.తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ పిల్లలు తప్పు చేస్తే వెనకేసుకురావడం మాని, తప్పును తప్పుగా ఎత్తిచూపినప్పుడే నేర రహిత సమాజం సాధ్యమవుతుంది. ఒక్కసారి నమ్మకం కోల్పోతే ఆ బంధాన్ని మళ్లీ మునుపటిలా మార్చడం చాలా కష్టం,కుటుంబాలు విడిపోవడానికి, రక్త సంబంధాలు శాశ్వతంగా దూరమవడానికి ఇదే ప్రధాన కారణమవుతుంది అలాగే నమ్మకం కోల్పోయిన చోట అనుమానం నీడలా వెంటాడుతుంది. కుటుంబంలో నమ్మకం అనేది గాజు గ్లాసు లాంటిది. ఒక్కసారి పగిలితే అతుకడం ఎంత కష్టమో, నమ్మకం పోతే బంధాలు కూడా అంతే బలహీనపడతాయి. తాజాగా వెలుగు చూసిన ఒక ఉదంతంలో కన్న కూతురు కాకపోయినా, సొంత చెల్లి కూతురు బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సింది పోయి, ఏకంగా దొంగకు సహాయం చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.ఈ ఘటన కేవలం ఒక కుటుంబానికి పరిమితమైన వ్యక్తిగత విషయంగా మిగిలిపోదు, సమాజం ముఖచిత్రంపై ఇది తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది.

డూప్లికేట్ తాళంతో భారీ చోరీ..

అక్టోబర్ 20వ తేదీన నేరేడ్‌మేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానే పద్మావతి అనే మహిళ తన ఇంట్లో పని మనిషితో కలిసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన సమయంలో దుండగులు డూప్లికేట్ తాళం సహాయంతో ఇంటి తాళం తీసి,సుమారు 556 గ్రాముల బంగారు ఆభరణాలు,2.9కిలోల వెండి వస్తువులను దొంగలించారు.ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్‌మేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 888/2026, బి.ఎన్.ఎస్ సెక్షన్ 305(ఏ) కింద కేసు నమోదు చేసి నేరేడ్‌మేట్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేసి,నిందితుడిని గుర్తించారు.నవంబర్ 5వ తేదీన తిరుమలగిరి సమీపంలో కూకట్‌పల్లి నిజాంపేట్ రోడ్,వెంకటాద్రి బ్లాక్‌కు చెందిన రేగుల చంద్ర శేఖర్ (31) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చంద్ర శేఖర్ ప్రైవేట్ ఉద్యోగిగా/హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణ సమయంలో,బాధితురాలైన చెల్లి కూతురికి నిందితుడు చంద్ర శేఖర్ కు చదువుకునే సమయంలో పరిచయం ఉండడం,బీటెక్ చదివిన చెల్లికూతురు,ఇంటర్ వరకే చదివిన క్యాబ్ డ్రైవర్ అయిన నిందితుడిని మాట్లాడుతూ ఇంకా ఎన్నాళ్లు ఇలా కష్టపడతావ్ అని తొందరగా స్థిరపడాలని చెప్పి,ఇంటి తాళాలను డూప్లికేట్ చేసి నిందితుడికి అందచేసి,ఏ సమయం చోరికి పాల్పడాలో వ్యూహం రచించింది.రోజువంద,వెయ్యి చూసే శేఖర్ ఒక్కసారిగా ఊహించలేని నగదు,బంగారం కళ్ల ముందు కనిపించేసరికి ప్రపంచాన్ని జయించినంత ఆనందంతో రాష్ట్రం దాటిపోయిన కొత్తరకం దొంగ.అయితే నిందితులు ఒక్కరు కాదు,ఇద్దరు పోలీసుల వేటలో ఒక్కడు అడ్డంగా బుక్కయ్యాడు. మరో వ్యక్తి పరారీలో ఉన్న సహచరుడు ఏ2-షాజీతో కలిసి ఈ దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి మొత్తం 429.92 గ్రాముల బంగారు ఆభరణాలు,2,974 గ్రాముల వెండి వస్తువులను పోలీసులు రికవరీ చేశారు. అదనంగా నేరానికి ఉపయోగించిన డూప్లికేట్ తాళం,గూగుల్ పిక్సెల్ మొబైల్ ఫోన్, ఏపి16సిడబ్యూ 8883 రిజిస్ట్రేషన్ నంబర్ గల మారుతి సుజుకి స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దొంగతనం చేసిన బంగారంలో సుమారు 13తులాలను గుంటూరులోను, హైదరాబాద్‌లో సుమారు 25 తులాలను (రూ. 25,00,000/- లకు)



విక్రయించినట్లు విచారణలో తేలింది.మిగిలిన బంగారాన్ని భవిష్యత్తులో విక్రయించడానికి తన దగ్గరే ఉంచుకున్నట్లు చెప్పాడు. పరారీలో ఉన్న నిందితుడి ఆచూకీ కోసం మిగిలిన ఆస్తులను రికవరీ చేయడానికి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మల్కాజ్‌గిరి కమిషనర్ బి. సుమతి, మల్కాజ్‌గిరి జోన్ డి.సి.పి.సిహెచ్.శ్రీధర్, మల్కాజ్‌గిరి డివిజన్ ఎసిపి వీ.యాదగిరి రెడ్డి, నేరేడ్ మేట్ ఇన్స్పెక్టర్ ఎ.వెంకటయ్య, డిఐ.విజయ్ భాస్కర్ రెడ్డి, పర్యవేక్షణలో ఈ కేసును చేధించారు. క్రైం టీం రాఘవ చారి, శ్రీనివాస్.

అక్బర్జపేట్‌లో హరితహారం మొక్కలు ధ్వంసం

మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని అక్బర్జపేట్‌లో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఓ వైపు నాటిన మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపింది.ఇటీవల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని మారినో బిస్కట్ కంపెనీ సమీపం నుంచి అక్బర్జపేట్‌లోని పోచమ్మ తల్లి ఆలయం వరకు రోడ్డుకు ఓ వైపు హరితహారం మొక్కలను నాటారు.అయితే, కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఆ మొక్కలను పీకి పడేయడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సుమారు అర కిలోమీటరు మేర నాటిన 150కి పైగా మొక్కలను ధ్వంసం చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటుతుంటే, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జ్యూస్ అందించి మానవత్వం చాటుకున్న పోలీసులు

దాహంతో అల్లాడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తికి అండగా నిలిచిన హోంగార్డు రాఘవేందర్ రాజు, కానిస్టేబుల్ మనోజ్

అబిడ్స్ పోలీసుల సేవాభావానికి పలువురి అభినందనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విధి నిర్వహణలో ఉన్నప్పటికీ తోటి మనిషి కష్టాన్ని గుర్తించి తక్షణమే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డు బొల్లేపల్లి రాఘవేందర్ రాజు, కానిస్టేబుల్ మనోజ్. అబిడ్స్ పరిధిలో పెట్రోల్ వాహన విధులు నిర్వహిస్తున్న సమయంలో దాహంతో ఇబ్బంది పడుతున్న గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తిని వారు గమనించారు.వెంటనే స్పందించిన రాఘవేందర్ రాజు, మనోజ్ ఆ వ్యక్తికి జ్యూస్‌తో పాటు మంచినీళ్లు అందించి దాహం తీర్చారు. పోలీసు విధుల్లో భాగంగా శాంతిభద్రతలను కాపాడటమే కాకుండా, ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం ద్వారా తమలోని మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.విధి నిర్వహణలో ఉన్నా మానవత్వానికి ప్రాధాన్యతనిస్తూ నిరుపేదలు, అభాగ్యుల పట్ల చూపిన ఆదరణ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. పోలీసులంటే కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాకుండా, ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలిచే ఆప్తులని ఈ ఘటన మరోసారి నిరూపించింది. మానవ సేవే మాధవ సేవ అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన హోంగార్డు రాఘవేందర్ రాజు, కానిస్టేబుల్ మనోజ్‌లను పలువురు అభినందిస్తున్నారు. పోలీసు అధికారులకు వీళ్ళు ఆదర్శంగా నిలుస్తున్నారని పోలీసు ఉన్నతాధికారుల సైతం ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే ఇక పోలీసు వ్యవస్థ పై ప్రజలకు అపరమైన నమ్మకం కలుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఓఆర్ఆర్ టోల్ ప్లాజా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు దుర్మరణం

తల్లి పరిస్థితి విషమం.. వెనుక నుంచి యాక్టివాను ఢీకొన్న లారీ



కీసర(ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధిలోని ఓఆర్ఆర్ టోల్ ప్లాజా సర్కిల్ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ వెనుక నుంచి యాక్టివా స్కూటర్‌ను ఢీకొట్టడంతో 18 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతని తల్లి తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం సుమారు 11:40 గంటల సమయంలో ఈసీఐఎల్ నుంచి కీసర మండలంలోని చీకటిమామిడి గ్రామానికి తల్లి డి. సక్కుబాయితో కలిసి సూర్య ప్రకాష్ (18) యాక్టివా స్కూటర్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓఆర్ఆర్ టోల్ ప్లాజా సర్కిల్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ (టీజీ 08 యూ 6678) అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ యాక్టివాను ఢీకొట్టింది. దీంతో తల్లీకొడుకులు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో లారీ చక్రం సూర్య ప్రకాష్ తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.అతని తల్లి సక్కుబాయికి తలపై రక్తగాయాలతో పాటు నడుము, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు. సూర్య ప్రకాష్ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి, గాయపడిన అతని తల్లిని ఈసీఐఎల్‌లోని ఆక్సీకేర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ప్రభుత్వ తీరు

- భూగర్భ జలాలు అడుగంటిన తర్వాతే పాలకులకు జ్ఞానోదయమా.?
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు శూన్యం
- కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న గ్రేటర్ హైదరాబాద్, భూమిలోకి ఇంకని వర్షపు నీరు
- సీసీ రోడ్లకు స్వస్తి పలికి బీటీ రోడ్లు వేయాలి.
- ఇంకుడు గుంతలు, వ్యవసాయ చెరువుల నిర్మాణం చేపట్టాలి

(ఆర్ కె -ప్రశ్న న్యూస్ బ్యూరో)



చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వ వ్యవహారశైలి కనిపిస్తోంది. భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నా, నీటి మట్టాలు వెయ్యి అడుగులకు మించి పడిపోతున్నా పట్టించుకోని పాలకులకు ఇప్పుడు ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు గుర్తుకు వచ్చాయా.? భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాతే మేల్కొంటుండటంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి పేరుతో కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తున్న పాలకులు, అధికారులు భవిష్యత్తు తరాల నీటి అవసరాలను మాత్రం విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, అంతర్గత వీధుల్లో ఎక్కడ చూసినా సిమెంట్ కాంక్రీట్ రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వర్షం పడితే ఆ నీరు భూమిలోకి ఇంకే అవకాశం పూర్తిగా తగ్గి, మురుగునీటి కాలువలు, నాలాల ద్వారా వృథాగా బయటకు వెళ్లిపోతోంది. భూగర్భ జలాలను పెంచాల్సిన సమయంలో వాటి సహజ పునరుత్పత్తికి అడ్డుకట్ట వేస్తున్న విధానాలను అనుసరించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో వర్షాలు తగ్గే అవకాశం ఉందని, తాగునీటి అవసరాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలకు మాత్రం తగిన ప్రాధాన్యత కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. మంత్రుల, అధికారుల సమావేశాలు, ప్రకటనలు, సమీక్షలతో భూగర్భ జలాలు పెరగవని, ముందు చూపుతో క్షేత్రస్థాయిలో పకడ్బందీ కార్యాచరణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

కాంక్రీట్ రోడ్లతో జలవనరులకు ముప్పు..

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో అవసరానికి మించి కేవలం కమిషన్ల కోసమే సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ఉన్న బీటీ రోడ్లను తొలగించి కాంక్రీట్ రోడ్లు వేయడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే సహజ మార్గాలు తగ్గిపోతున్నాయి. రహదారుల నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా.? అభివృద్ధి అంటే సి సి రోడ్లు వేయడమేనా.? భవిష్యత్తు తరాలకు తాగునీటిని అందించడం అభివృద్ధిలో భాగం కాదా.? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.

జలసిరి పథకానికి కార్యాచరణ ఏది.?

జలసిరి పథకం కింద వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్లు, గ్రామాలు, పట్టణాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ఇళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా కచ్చితంగా కాపాడాలి. వర్షపు నీటిని వృథాగా సముద్రంలోకి, ఇతర ప్రాంతాలకు తరలించకుండా స్థానికంగానే భూగర్భంలోకి ఇంకించే వ్యవస్థలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి..

అధికారం వచ్చింది పాలకులం అయినాము మాకు ఎవరు ఏమి చెప్పేది, ఏమి సూచనలు చేసేది, అనుకుంటే అంటే భవిష్యత్ తరాలు అంధకారంలోకి పోవాల్సిందే.గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రముఖ నగరాల్లో కొత్తగా సీసీ రోడ్లు వేయడంను పూర్తిగా బ్యాన్ చేసి, బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న కాంక్రీట్ రోడ్ల పక్కన వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. ఇప్పటికైనా పాలకులు రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి పర్యావరణ పరిరక్షణకు, జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే నేడు నిర్లక్ష్యం చేస్తున్న నీటి సమస్య రేపటి తరాలకు తీరని శాపంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఎల్బీనగర్ ఫైర్‌స్టేషన్‌లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు



ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతుల కోసం వచ్చే యజమానుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉప్పల్ భగాయత్‌లోని ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్‌లో ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాణసంచా దుకాణాల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో రూ.500 మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ఒక్కో దుకాణం నుంచి రూ.1,500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, డీజీ, జేడీ అనుమతితో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక తనిఖీల్లో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శీనయ్య వద్ద రూ.10,500, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్ వద్ద రూ.10 వేలు, ఫైర్ ఫైటర్ల వద్ద కలిపి మొత్తం రూ.30 వేల నగదును గుర్తించినట్లు వెల్లడించారు. బాణసంచా దుకాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. నలుగురి ఖాతాల్లోకి ఈ లావాదేవీలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని, ఒకరి ఖాతాలో 53, మరొకరి ఖాతాలో 20, ఇంకొకరి ఖాతాలో 15 లావాదేవీలు ఉన్నట్లు తెలిపారు. గత నాలుగైదు రోజుల్లో సుమారు 90 మందితో ఆన్‌లైన్ ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు వివరించారు. గత వారం, పది రోజుల వ్యవధిలో బాణసంచా దుకాణాల అనుమతుల కోసం సుమారు 397 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో కొన్ని దరఖాస్తులకు అనుమతులు మంజూరయ్యాయని వారి నుండి లావాదేవీలు జరిగాయని మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడానికి గల కారణాలు, డబ్బుల కోసం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారా అనే అంశాలపై కూడా విచారణ జరుపుతామన్నారు. లావాదేవీలు జరిపిన దరఖాస్తుదారులను సైతం విచారిస్తామని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఏనుగు పిల్ల కోసం ఎయిర్‌లిఫ్ట్

- అనాథ పిల్లకు అండగా అనంత్ అంబానీ వంతారా!



ముంబై (ప్రశ్న న్యూస్) రెండు కాళ్లు విరిగి తీవ్ర అస్వస్థతతో ప్రాణాలతో పోరాడుతున్న 18 నెలల ఏనుగు పిల్ల 'మాయ' ప్రాణాలను కాపాడేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ స్థాపించిన 'వంతార' సంస్థ ముందుకు వచ్చింది. పుట్టిన వెంటనే తల్లి తప్పిపోవడంతో కేరళ అటవీశాఖ సంరక్షణలో పెరిగిన ఈ చిన్నారి గజరాజు ఎముకలు బలహీనపడటంతో నడవలేని స్థితికి చేరింది. కేరళ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులతో వంతార ప్రత్యేక వైద్య బృందం రంగంలోకి దిగింది. అత్యాధునిక లైఫ్ సపోర్ట్ సదుపాయాలతో కూడిన ప్రత్యేక విమానంలో కేరళ నుంచి గుజరాత్‌లోని జామ్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రయాణంలో వంతార పశువైద్యులతో పాటు ఇంతకాలం మాయను కనిపెట్టుకుని ఉన్న కేరళ అటవీ సంరక్షకుడు కూడా తోడుగా వెళ్లారు. పూర్తిగా కోలుకున్న తర్వాత ఏనుగు పిల్లను తిరిగి కేరళలోని అభయారణ్యానికి పంపుతారు.

- పారాథైరాయిడ్ సమస్య గుర్తింపు

గతేడాది ఏప్రిల్ నెలలో మలయత్తూరు అటవీ డివిజన్‌లోని నదీ తీరంలో ఒంటరిగా పడి ఉన్న ఈ ఏనుగు పిల్లను అధికారులు రక్షించి 'మాయ' అని పేరు పెట్టారు. అసిస్టెంట్ ఫారెస్ట్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ బినోయ్ బాబు బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ పాలు తాపి పెంచింది. అయితే నాలుగు నెలల క్రితం ఆడుకుంటూ కిందపడటంతో భుజానికి తీవ్ర గాయమైంది. ఫిజియోథెరపీ, మందులు అందించినప్పటికీ ఎముకలు మరింత పెళుసుగా మారిపోయాయి. అక్టోబర్ నాటికి రెండు ముందు కాళ్లు విరిగిపోవడం, ఛాతీ ఇన్ఫెక్షన్ రావడంతో మాయ లేచి నిలబడలేని దుస్థితికి చేరింది. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కుశల్ కొన్వర్ శర్మ ఆధ్వర్యంలోని నిపుణుల బృందం పరీక్షించి దీనికి పారాథైరాయిడ్ సంబంధిత సమస్య ఉండవచ్చని తేల్చింది. జామ్‌నగర్‌లోని వంతార సంరక్షణ కేంద్రంలో మాయ కోసం ప్రత్యేక హైడ్రాలిక్ లిఫ్టింగ్ పరికరాలు, హైడ్రోథెరపీ, నిరంతర నొప్పి నివారణ చికిత్సలను సిద్ధం చేశారు. ప్రతి జీవి ప్రాణం ఎంతో విలువైందని, మాయను కాపాడటానికి శాయశక్తులా పోరాడతామని వంతార సీఈఓ వివరించారు. ఎంతో వ్యయప్రయాసలతో చేపట్టిన ఈ ఎయిర్‌లిఫ్ట్ ఆపరేషన్ వన్యప్రాణి ప్రేమికుల ప్రశంసలు అందుకుంటోంది.

సీటీసీలో భారీ మోసాలు

బ్రాండెడ్ పేరుతో లోకల్ సరుకు

- ఎస్టిమేషన్ లో ఒకటి.. అసెంబ్లింగ్ లో మరొకటి
- గ్యారెంటీ అడిగితే చేతులెత్తేస్తున్న దుకాణాలు
- జీఎస్టీ ఎగవేతతో ప్రభుత్వానికీ భారీగా టోకరా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కంప్యూటర్ కొనాలంటే హైదరాబాద్ లో అందరికీ గుర్తొచ్చే పేరు సీటీసీ. కానీ ఇప్పుడు అదే సీటీసీ వినియోగదారులను నిలువునా మోసం చేసే కేంద్రంగా మారిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నమ్మి కొనే వినియోగదారుడికి నాసిరకం సరుకు అంటగడుతూ లక్షల్లో దండుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ భవనంలో ఉన్న దాదాపు అన్ని దుకాణదారులు వినియోగదారులను నిలువునా మోసం చేస్తున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

ఎస్టిమేషన్ లో బ్రాండెడ్... లోపల లోకల్..

దుకాణంలోకి వెళ్తే చాలు. బ్రాండెడ్ కంపెనీ పేర్లతో అందమైన ఎస్టిమేషన్ చేతిలో పెడతారు. ఈ బ్రాండ్ మదర్ బోర్డు, ఆ బ్రాండ్ ర్యామ్, ఈ కంపెనీ హార్డ్ డిస్క్ అని నమ్మిస్తారు. ధర కూడా బ్రాండెడ్ దానికి వేస్తారు. కానీ కంప్యూటర్ అసెంబుల్ చేసేటప్పుడు మాత్రం లోపల లోకల్, నాసిరకం పరికరాలు వేసేస్తున్నారు. బయటకు తెలియకుండా స్టిక్కర్లు మార్చి మోసం చేస్తున్నారు. తీరా ఇంటికి వెళ్లి చూసుకుంటే అసలు విషయం బయటపడుతోంది. కొంతమందికి కొన్ని రోజులకే తిరిగి మరమ్మత్తులు గురవుతున్నాయని తీసుకొచ్చి అడిగితే మీరు సరిగ్గా వాడలేదు అంటూ బుకాయించడం ఎక్కడ పరిపాటిగా మారిందని వినియోగదారులపైనే దాడులకు, దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు వసూలు... గ్యారెంటీ మాత్రం నో..

పరికరాలు అమ్మేటప్పుడు వేలల్లో డబ్బులు వసూలు చేస్తారు. కానీ గ్యారెంటీ, వారంటీ అడిగితే మాత్రం మొహం చాటేస్తున్నారు. "గ్యారెంటీ లేదు సార్, ఇదే రేటు" అంటూ దబాయిస్తున్నారు. రెండు రోజులకే పరికరం పాడైతే దుకాణం చుట్టూ తిప్పుకుంటున్నారు. రిపేర్ కు మళ్లీ డబ్బులు గుంజుతున్నారు. ఇదేం వ్యాపారం అని వినియోగదారులు నిలదీస్తున్నారు.

జీఎస్టీ ఎగవేత... ప్రభుత్వానికి కోట్ల నష్టం..

ఇదంతా ఒక ఎత్తు అయితే, జీఎస్టీ, సీఎస్టీ పూర్తి స్థాయిలో చెల్లించకుండా ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బిల్లు లేకుండా అమ్మకాలు, తక్కువ బిల్లు చూపించి పన్ను ఎగవేత యథేచ్ఛగా సాగుతోంది. దీనివెనుక అధికారులతో అంతర్గత ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దానికి తోడు పార్కింగ్ దబ్బులు వసూలు చేయడం మున్సిపల్ నిబంధనల ప్రకారం విరుద్ధం కానీ మున్సిపల్ అధికారులతో చేతులు కలిపి యదేచ్ఛగా పార్కింగ్ దబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు.

అధికారులు స్పందిస్తారా.?

సీటీసీలో జరుగుతున్న ఈ దందాపై మున్సిపల్, వినియోగదారుల ఫోరం, జీఎస్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ శాఖ వెంటనే దాడులు చేసి తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మోసపూరిత దుకాణాల లైసెన్సులు రద్దు చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి స్పందిస్తుందా.? లేక మామూళ్ల మత్తులోనే ఉంటుందా.? అనేది వేచి చూడాలి.

పెన్షనర్ల ఆధార్, పాన్ వెరిఫికేషన్ డిసెంబర్ 31లోగా పూర్తికి ఆదేశం



మేడ్చల్(ప్రశ్న న్యూస్)రాష్ట్రంలోని సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల ఆధార్, పాన్ వివరాల పరిశీలన, ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ అప్ డేషన్ పై ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖ డైరెక్టర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మెమో నంబరు హెచ్4/147/2026, తేదీ 14/10/2026 ద్వారా రాష్ట్రంలోని అన్ని యూనిట్ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్ల ఆధార్, పాన్ వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పెన్షన్ మాడ్యూల్ లో నమోదై ఉన్న వివరాలతో సరిపోల్చి క్షుణ్ణంగా సరిచూడాలని, వివరాల్లో ఏవైనా తేడాలు ఉన్నట్లయితే అవసరమైన చోట పెన్షనర్ల నుంచి ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్ ప్రతులు సేకరించి పోర్టల్ లో సరిచేసి అప్ డేట్ చేయాలని ఆదేశించారు. పెన్షనర్ల సరైన గుర్తింపును నిర్ధారించడం, మరణించిన పెన్షనర్ల వివరాలను సరిచూడడం, అక్రమంగా పెన్షన్ పొందే విధానాన్ని నిరోధించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలగకుండా చూడటమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తూ రికార్డుల్లో ఆధార్, పాన్ లేని వారి నుంచి వివరాలు సేకరించి డిసెంబరు 31, 2026 నాటికి అప్ డేషన్ ప్రక్రియ మొత్తాన్ని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఉత్తర్వుల అమలులో భాగంగా జిల్లాల్లో ట్రెజరీ అధికారులు రికార్డుల్లో తేడాలు ఉన్న లేదా అదనపు సమాచారం అవసరమైన పెన్షనర్లకు ఫోన్ కాల్స్ చేసే అవకాశం ఉన్నందున పెన్షనర్లు సానుకూలంగా స్పందించి అధికారులు కోరిన వివరాలను అందజేయాలని సూచించారు. అయితే దీనిని ఆసరా చేసుకుని ఫ్రాడ్ కాల్స్ వచ్చే ప్రమాదం ఉన్నందున పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ లో ఆధార్, పాన్ నంబర్లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని, వీలైనంత వరకు నేరుగా ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి తమ ఆధార్, పాన్ వివరాలు, జిరాక్స్ ప్రతులను

సంబంధిత అధికారులకు సమర్పించడం మంచిదని, నేరుగా వెళ్లలేని వారు తమ కుటుంబ సభ్యుల ద్వారా పంపించడం శ్రేయస్కరమని అధికారులు సూచిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588